JANASAMAYAM FORTNIGHTLY

TGTEL/26/A2074

# జన సమయం

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి:1 సంచిక:9 16-31 ఆగస్ట్ 2026 ఎడిటర్: వి. యాదమ్మ పేజీలు:52 వెల:20/-



# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం





నారాయణపేట (జనసమయం ప్రతినిధి): పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గతంలో రేషన్ బియ్యం తినేవారిని చిన్నచూపు చూసే పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు ఆ రోజులు పోయాయని మంత్రి అన్నారు. పెద్దవారైనా, పేదవారైనా అందరూ ఒకే రకమైన నాణ్యమైన బియ్యం తినాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆలోచనతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రతి పేద కుటుంబానికి నెలకు 6 కిలోల సన్న బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సోనా మసూరి బియ్యం తినేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గతంలో "వరి వేస్తే ఉరి" అన్న పరిస్థితులు ఉండగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరి ఉరి కాదు.. సిరి అని నిరూపించిందని మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే అత్యధికంగా 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. పండించిన పంటకు క్వింటాల్కు రూ.500 బోనస్ అందిస్తూ ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 62 లక్షల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. స్మార్ట్ ఫుడ్ సెక్యూరిటీ కార్డు ద్వారా బియ్యం మాత్రమే కాకుండా పేదలకు అనేక సంక్షేమ ప్రయోజనాలు అందనున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్డు పేదల భద్రతకు ప్రతీకగా నిలుస్తుందని, కార్డు ఉన్న ప్రతి కుటుంబా నికి బియ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఏ గ్రామానికి చెందిన రేషన్ బియ్యాన్ని అదే గ్రామంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను ఆదేశించారు. స్మార్ట్ రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు తదితర అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి వివరించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

జన సమయం

TGTEL/26/A2074

# జన సమయం

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

H.No. 4-42-332, Chennareddy Nagar, Asbestos Colony, Hyderabad (TG) 500037

సంపుటి : 01 సంచిక : 09 16-31అగస్టు 2026 పేజీలు : 52 వెల : 20/-

## లోపల పేజీలో....


| | |
|---|---|
| భారీ పెట్టుబడుల సదస్సు | 5 |
| ఓటుకు నోటు కేసు | 6 |
| గ్రాడ్యుయేట్ ఎన్నికలు | 7-8 |
| బరి తెగించిన విద్యాసంస్థలు | 10 |
| బిగ్ ప్లాన్‌లో బీజేపీ | 17 |
| ప్లాన్ బీలో రేవంత్ | 21 |
| కాక్రోచ్‌కు నిధులెలా | 24 |
| మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ | 25 |
| సప్తధార..భారత్ | 26 |
| మా సంక్షేమ ఆలోచనలో | 27 |
| రాజ్యసభలో ఖర్గే ఆవేదన | 28 |
| భారత రాజ్యాంగం | 40-43 |
| సాహిత్యం | 44 |
| ఆరోగ్యం | 46 |
| క్రీడలు | 48 |
| సినిమా | 49 |


Editor, Publisher & Owned By :
**V. YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal
Wanaparthy Dist.Telangana-509380

Editor :
**V. YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal
Wanaparthy Dist.Telangana -509380
Cell : 9381205266
email : janasamayam@gmail.com

Printer : **VARDA YADAIAH**
Printed at : Mythri Art Printers,
Shop No. 10, Dcc Bank Complex,
Mahabubnagar,Telangana-509001.

Place of Publication **V.YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal, Wanaparthy Dist.
Telangana -509380
Cell : 9381205266

*Ads Manging Director*
Panditi Prudhvi Kumar Reddy
Cell : 8977022449

## సంపాదకీయం

# రిజర్వేషన్లు లేని సమాజం సాధ్యమా..

కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేముందు ఆ ప్రశ్న సరైనదేనా అని అడగాలి ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రతి చర్చ ఒకే విధంగా పుట్టదు. కొన్ని చర్చలు సమాజం అవసరం వల్ల వస్తాయి. మరికొన్ని రాజకీయాల అవసరం వల్ల వస్తాయి. ఈ రెండింటి మధ్య తేడా గుర్తించకపోతే సమాధానం ఎంత సరైనదైనా అది అసలు ప్రశ్ననుంచి తప్పించుకోవచ్చు. రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చ కూడా అలాంటిదే. పైకి చూస్తే అది ఒక విధానం గురించి చర్చలా కనిపిస్తుంది. కానీ కొంచెం లోతుగా చూస్తే అది భారత ప్రజాస్వామ్యం తన గురించి తాను వేసుకోవాల్సిన ఒక పెద్ద ప్రశ్నను తాకుతుంది. అదే 'సామాజిక న్యాయం పూర్తయిందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలియకుండా దాన్ని సాధించే విధానాలపై తీర్పు చెప్పడం అంటే గమ్యానికి చేరామో లేదో చూడకుండానే ప్రయాణాన్ని ఆపేయాలని నిర్ణయించడం లాంటిది. జర్మన్ తత్వవేత్త యుర్గన్ హెబెర్మాస్ ఆధునికతను ఒక అసంపూర్ణ ప్రాజెక్టు గా అభివర్ణించాడు. ఈ భావనలోని అసలు బలం ఒకే మాటలో ఉంది. అసంపూర్ణమంటే విఫలం అని కాదు. ఇంకా పూర్తి చేయాల్సిన బాధ్యత మిగిలి ఉందని అర్థం. ప్రతి అసంపూర్ణ ప్రాజెక్టుకు ముందు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి అది పూర్తి కాలేదు అని చెప్పి విఫలమైందని ప్రకటించడం. రెండోది ఎందుకు పూర్తికాలేదో అర్థం చేసుకొని దాన్ని పూర్తి చేసే బాధ్యతను స్వీకరించడం. భారత ప్రజాస్వామ్యం ముందు కూడా నేడు అదే ఎంపిక ఉంది. రిజర్వేషన్లపై చర్చ చివరికి ఆ ఎంపిక గురించే. రాజ్యాంగ నిర్మాతలు ఒక గొప్ప నైతిక సత్యాన్ని గుర్తించారు. చట్టం సమానత్వాన్ని ప్రకటించగలదు. కానీ చరిత్రను రద్దు చేయలేదు. ఎందుకంటే అసమానత అనేది కేవలం వర్తమాన సమస్య కాదు, వర్తమానంపై గతం చూపే ప్రభావం. అందుకే శతాబ్దాలుగా అవకాశాలకు దూరమైన వర్గాలకు ఇప్పటినుంచి అందరూ సమానం అని చెప్పడం న్యాయం కాదని వారు అర్థం చేసుకున్నారు అందుకే సమానత్వాన్నీ కేవలం హక్కుల భాషలోనే కాదు అవకాశాల భాషలో కూడా నిర్వచించారు. రిజర్వేషన్లు ఆ తర్కం నుంచే పుట్టాయి. అవి ప్రత్యేక హక్కులు కాదు. చరిత్ర మూసివేసిన తలుపులను ప్రజాస్వామ్యం మళ్లీ తిరిగి రాయడానికి నిర్మించిన రాజ్యాంగబద్ధ వంతెన. ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఇదే చెబుతుంది. అమెరికా బానిసత్వం తర్వాత, దక్షిణాఫ్రికా అపార్థెయిడ్ తర్వాత, బ్రెజిల్ వర్ణ అసమానతల నేపథ్యంలో, కెనడా స్థానిక ప్రజల హక్కుల విషయంలో, న్యూజిలాండ్ మావోరీ ప్రజల రాజకీయ ప్రాతినిధ్యంలో. రూపాలు,పేర్లు వేరు కావచ్చు. కానీ ప్రతి సమాజం ఒకే సత్యాన్ని ఎదుర్కొంది. చరిత్ర సృష్టించిన అసమానతులను మార్కెట్ స్వయంగా సరిచేయదు. పోటీ కూడా సరి చేయదు. అందరికీ సమాన అవకాశం అనే నినాదం ఒకటే వాటిని తొలగించదు. ప్రజాస్వామ్యం కొన్నిసార్లు చరిత్రతో వాదించాల్సి వస్తుంది. ప్రత్యేక అవకాశాల విధానాలు ఆ వాదనలో భాగం. అవి సమానత్వానికి మినహాయింపులు కాదు. సమానత్వాన్ని వాస్తవం చేయటానికి ఉపయోగపడే మార్గాలు. రిజర్వేషన్లపై ప్రతి చర్చలో 'మెరిట్' అనే పదం తప్పనిసరిగా వినిపిస్తుంది. కానీ మెరిట్ అనేది అవకాశాల నుంచి వేరు చేసుకోగలిగే గుణం అయితే సమాజం ఎప్పుడో న్యాయబద్ధమై ఉండేది.నిజానికి మెరిట్ కూడా ఒక సామాజిక నిర్మాణమే. ఒక పిల్లవాడు ఏ పాఠశాలలో చదివాడు, ఇంట్లో చదివే గది ఉందా, తల్లిదండ్రుల విద్యా స్థాయి ఏంటి, అతను ఆకలితో పాఠశాలకు వెళ్లాడా లేక ఆత్మవిశ్వాసంతో వెళ్ళాడా, కులం కారణంగా అవమానాన్ని ఎదుర్కొన్నాడా లేదా ఇవన్నీ అతని సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి.

V. yadamma

# డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారీ పెట్టుబడుల సదస్సు

అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ రెడీ అవుతోంది. డిసెంబర్‌లో 3 రోజుల పాటు భారీ పెట్టుబడుల సదస్సును నిర్వహించేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో జరిగే ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ ప్రణాళికతో పాటు డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా, ఐటీ, గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో పెట్టుబడి అవకాశాలను ప్రదర్శించనున్నారు. తెలంగాణలో పెట్టుబడుల ఆకర్షణకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తాజాగా సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో మూడు రోజుల పాటు ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహించాలని నిర్ణయించింది. గతేడాది నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కంటే ఈసారి మరింత విస్తృత స్థాయిలో సదస్సును నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేయనుంది. ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ ప్రధాన థీమ్‌గా.. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0ను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు వివరించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సదస్సు ఏర్పాట్ల కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. విదేశీ ప్రతినిధులు, పెట్టుబడిదారులను ఆకర్షించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రణాళికను కూడా గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచానికి పరిచయం చేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. హైదరాబాద్ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసే ప్రణాళికలు, మౌలిక వసతుల అవకాశాలను పెట్టుబడిదారుల ముందుంచేలా ప్రత్యేక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. తెలంగాణలో డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా, ఐటీ, గ్రీన్ ఎనర్జీ, తయారీ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను ఈ సదస్సు ద్వారా ప్రపంచ దేశాలకు ప్రదర్శించనున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, స్టార్టప్‌ల విజయాలను కూడా అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వివిధ రంగాల్లో తెలంగాణకు చెందిన సంస్థలు, స్టార్టప్‌లు సాధించిన విజయాలతో పాటు వినూత్న ఉత్పత్తులు, ఆవిష్కరణలను ప్రదర్శించే ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను కూడా ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0లో ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రానికి మరిన్ని భారీ పెట్టుబడులను తీసుకురావడం, పరిశ్రమల విస్తరణకు అనుకూల వాతావరణాన్ని ప్రపంచానికి తెలియజేయడం ఈ సమ్మిట్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అవకాశాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ద్వారా కొత్త పెట్టుబడి ప్రతిపాదనలకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.



# ఓటుకు నోటు కేసులో స్పెషల్ బెంచ్

కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో.. పకడ్బందీ ప్రణాళికతో.. ఏసీబీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో వారు అప్పటి టిడిపి ఎమ్మెల్యే రేవంత్ రెడ్డిని పట్టుకున్నారు. ఓటుకు నోటు కేసులో అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత తెలంగాణలో రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రకే పరిమితం కావలసి వచ్చింది. నాడు జరిగిన ఈ సంఘటన తెలంగాణ రాజకీయాలను సమూలంగా మార్చేసింది.నాడు నమోదైన ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. అనేక ప్రకంపనాలను సృష్టించింది. చివరికి ఈ కేసులో ఇప్పుడు మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసు విచారణలో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు విచారణను మళ్లీ మొదటికి తీసుకువచ్చింది. గతంలో ఈ కేసును ధర్మాసనం విచారించింది. తీర్పును రిజర్వ్ చేసింది.. అనేక రకాలుగా వాదనాల విన్న ఈ ధర్మాసనంలోనే న్యాయమూర్తులు ఇటీవల పదవి విరమణ చేశారు. నిబంధనల ప్రకారం చూసుకుంటే ఈ కేసు వాదనలను మళ్లీ మొదటి నుంచి వినాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వివరించారు. ఈ క్రమంలో ఈ కేసు మళ్లీ విచారణకు వస్తుందని సమాచారం.పది సంవత్సరాల క్రితం ఓటుకు నోటు కేసు నమోదయింది. నాడు ఈ కేసు పై నమోదైన పిటిషన్ల పై సుప్రీంకోర్టులో సుదీర్ఘంగా విచారణ కొనసాగింది. ఈ వాదనలను విన్న ధర్మాసనంలోని న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. ఫలితంగా సాంకేతిక కారణాల నేపథ్యంలో విచారణ కొంత పరిధిలో ఆగిపోయింది. రోస్టర్ ప్రక్రియలో భాగంగా ఈ కేసు ఇటీవల సీజేఐ ముందుకు వచ్చింది. న్యాయ ప్రక్రియ.. ఇతర నియమాల నేపథ్యంలో పాత వాదనలను తాము లెక్కలోకి తీసుకోలేమని సూర్యకాంత వివరించారు. ఈ ప్రకారం కొత్త బెంచ్ ఈ కేసును విచారించాల్సి ఉంటుంది. ఈ కేసులో మొదటి నుంచి వాదనలు వింటామని సిజెఐ ప్రకటించారు. మరోవైపు ఈ కేసు రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం ఉన్నది. అందువల్ల దీనిని వేగంగా విచారించడానికి ప్రత్యేకమైన ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు సిజెఐ వెల్లడించారు. నూతన ధర్మసనం ఏర్పాట తర్వాత.. వాదులు.. ప్రతిభాదులు తరపున న్యాయవాదులు మళ్లీ తమ వాదనలు వినిపించాల్సి ఉంటుంది. ఇన్నాళ్లపాటు ఈ కేసులో ఎటువంటి కదలిక లేదు. ఈ క్రమంలో ఈ కేసులో సర్వోన్నత న్యాయస్థానం రీ హియరింగ్ కు వస్తున్నామని సంకేతాలు ఇవ్వడంతో.. పొలిటికల్ గా హీట్ పెరిగింది.ఈ కేసు సంబంధించి మీడియా నుంచి అనేక రకాలుగా ప్రస్తుతం ముఖ్యమంత్రి కి ప్రశ్నలు ఎదురయ్యాయి. ఆ ప్రశ్నలకు ఆయన నేరుగాని సమాధానం చెప్పారు. తనను ఏ విధంగా ఇరికించారు.. దాని వెనుక ఉన్న మనుషులు ఎవరు.. వారి ప్రయోజనాలు ఏంటి అనే విషయాలను రేవంత్ రెడ్డి అనేక పర్యాయాలు వివరించారు. ఈ కేసు కు సంబంధించి తనలో ఎటువంటి ఆందోళన లేదని.. తీర్పు తనకు అనుకూలంగానే వస్తుందని అనేక సందర్భాల్లో రేవంత్ చెప్పారు. ఇప్పుడు సుప్రీంకోర్టు ముందుకు ఈ కేసు మళ్ళీ వస్తున్న నేపథ్యంలో.. రేవంత్ వర్గీయులు పెద్దగా ఆందోళన చెందడం లేదు. కంగారు పడడం లేదు. నాటి ప్రభుత్వం ఏకపక్షంగా ఈ కేసు నమోదు చేసిందని.. ఇందులో స్థాయికి మించి వ్యవహరించిందని.. పొలిటికల్ గా రేవంత్ రెడ్డికి నష్టం చేయాలని చూశారని.. చివరికి వారే నష్టపోయారని రేవంత్ రెడ్డి వర్గీయులు అంటున్నారు.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం కమలం, హస్తం వ్యూహాలు




హైదరాబాద్, జనసమయం;తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల వేడి ప్రారంభం కాబోతోంది. హైదరాబాద్?రంగారెడ్డి?మహబూబ్‌నగర్, అలాగే వరంగల్?ఖమ్మం?నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల స్థానాల గడువు 2027 మార్చి నాటితో ముగియనుండటంతో, కేంద్ర ఎన్నికల సంఘం మరో రెండు మూడు నెలల్లోనే కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు సమాయత్తమవుతోంది. రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, ఓటర్ల నమోదు బాధ్యతలపై ముందస్తు చర్చలు జోరందుకున్నాయి. సాధారణంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోరు అనగానే కేవలం ఓటింగ్ కాకుండా, దానికి ముందు ఓటర్లుగా పట్టభద్రులను సంతృప్తికరంగా నమోదు చేయించడమే అభ్యర్థి సగానికి పైగా గెలుపును నిర్ణయిస్తుంది. దీంతో ప్రధాన పార్టీలు రంగంలోకి దిగకముందే ఆశావహులు తమ స్థాయిలో గ్రౌండ్ వర్క్ ప్రారంభించారు.పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికల తరహాలో ఉండవు. ప్రతి ఆరేళ్లకు ఒకసారి పాత ఓటర్ల జాబితా రద్దయి కొత్తగా ఫారం-18 ద్వారా ఓటర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఏ పార్టీ అయితే ముందుగానే తమ అభ్యర్థిని ఖరారు చేస్తుందో, ఆ నాయకుడే సొంత వ్యయంతో, నెట్‌వర్క్‌తో పట్టభద్రులతో ఫారాలు పూర్తి చేయించి ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తారు. ఓటర్ల నమోదులో ఆధిక్యత సాధించిన అభ్యర్థికే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లు పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే నోటిఫికేషన్ రాకముందే టికెట్ ఆశిస్తున్న నాయకులు డిగ్రీ కళాశాలలు, ఉద్యోగుల సంఘాలు, ఐటీ కంపెనీలు , సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల వేదికగా తమ ప్రచార పర్వాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీలో ఈసారి అభ్యర్థుల పోటీ తీవ్రంగా ఉంది. సామ రామ్మోహన్ రెడ్డి వంటి యువ నేతలు పోటీకి రెడీ అవుతున్నారు. మరోవైపు, ఉపఎన్నికలో గెలిచిన తీన్మార్

మల్లన్న మళ్లీ పోటీకి ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. తన సోషల్ మీడియా నెట్‌వర్క్, గ్రాడ్యుయేట్ గ్రూపులతో పాటు గతంలో సంపాదించిన ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడానికి ఆయన క్షేత్రస్థాయిలో కసరత్తు మొదలుపెట్టారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. పట్టభద్రులు, పట్టణ ప్రాంత విద్యావంతులు, ఉద్యోగులు సాంప్రదాయకంగా తమకే అనుకూలంగా ఉంటారనేది బీజేపీ నమ్మకం. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ స్థానంలో గతంలో ఎన్. రామచందర్‌రావు విజయం సాధించిన చరిత్ర ఉండటంతో, ఈ సీటును తిరిగి కైవసం చేసుకోవాలని కమలం పార్టీ పట్టుదలతో ఉంది. సీనియర్ నాయకులతో పాటు యువ మోర్చా, విద్యార్థి సంఘాల రికార్డు ఉన్న నాయకులు ఈ సీటు నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బీజేపీ సైతం ఓటర్ల నమోదు ప్రారంభమయ్యే నాటికే అధికారికంగా లేదా సూచనప్రాయంగా అభ్యర్థులను ప్రకటించి ఫీల్డ్‌లోకి దించాలని భావిస్తోంది. ఈ మొత్తం సమీకరణాల్లో బీఆర్ఎస్ పార్టీ వైఖరి ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల అనంతరం గులాబీ పార్టీ తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే పట్టభద్రుల ఓటర్లలో మళ్లీ పట్టు సాధించకపోతే అర్బన్ ఓటర్లలో పార్టీ ప్రభావం తగ్గిపోతుందనే ఆందోళన బీఆర్ఎస్ అధిష్టానంలో ఉంది. మరి బీఆర్ఎస్ తరఫున పోటీ ఉంటుందా లేదా అంటే.. కచ్చితంగా అభ్యర్థులను నిలబెట్టక తప్పని పరిస్థితి. అయితే అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీని తట్టుకుని, ఆర్థికంగా, యంత్రాంగ పరంగా ఓటర్ల నమోదు ప్రక్రియను భుజాన వేసుకునే బలమైన అభ్యర్థిని వెతకడమే బీఆర్ఎస్‌కు పెద్ద పరీక్షగా మారింది. వాట్సాప్ గ్రూపులు, యూట్యూబ్ ఛానెళ్లు, ఫేస్‌బుక్ ఐటీ కమ్యూనిటీలలో ఇప్పటికే ఓటర్ల నమోదు అవగాహన ప్రచారాలు మొదలయ్యాయి. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఉద్యోగుల పీఆర్సీ, పెన్షన్ సవరణలు వంటి అంశాలు ప్రధాన ఎన్నికల అజెండాగా మారనున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు రంగానికి చెందిన నిరుద్యోగ పట్టభద్రులు ఎటువైపు మొగ్గు చూపుతారనే అంశం గెలుపోటముల్ని నిర్ణయించనుంది. రాబోయే మార్చి నాటికి ముగిసే ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఎన్నికలు కేవలం ఇద్దరు ఎమ్మెల్సీలను ఎన్నుకోవడమే కాకుండా, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనపై పట్టభద్రుల తీర్పుగా, బీజేపీ అర్బన్ ఇమేజ్‌కు సవాలుగా, అలాగే బీఆర్ఎస్ పుంజుకునేందుకు లభించే అవకాశంగా మారనున్నాయి. ఓటర్ల నమోదు నాటికే అభ్యర్థులను ఖరారు చేసి వ్యూహాత్మకంగా అడుగులు వేసే పార్టీకే విజయావకాశాలు మెండుగా ఉంటాయని అనుకోవచ్చు.



# తక్షణమే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయండి

## మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి..మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావులేఖ

రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాజకీయలకు అతీతంగా వెంటనే నీటి పంపింగ్ చేయండి వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలంటూ ఉత్తం కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు లేఖ. రిజర్వాయర్ లలో నీటిని సకాలం లో నింపక పోవడం వల్ల పంటల సాగు ముందుకు పోక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్న హరీష్ రావు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాలోని రిజర్వాయర్లు అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్ లను నింపి సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుండి మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని మంత్రి ఉ త్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి. ఒక వైపు ఎలినినో వల్ల తక్కువ వర్షభావం, మరో వైపు ప్రాజెక్టు ల్లో నీళ్లు లేక ఆందోళన లో అన్నదాతలు. వానాకాలం పంట సాగు కు సాగు నీరు కోసం ఎదురు చూస్తున్న రైతాంగంపై మాత్రం ఆలస్యం చేయకుండా రిజర్వాయర్ లకు నీటిని పంపింగ్ చేయాలని రైతుల పక్షాన లేఖ ద్వారా డిమాండ్ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాలోని రిజర్వాయర్ లు అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, నృసింహ బస్వాపూర్ రిజర్వాయర్ లను నింపి సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా మోటార్లను ఆన్ చేసి వెంటనే నీటి పంపింగ్ చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు రైతుల పక్షాన లేఖ..ప్రస్తుత వానాకాలం పంట సీజన్ రైతులు ఇటు ఎలినినో వల్ల తక్కువ వర్షాభావం, అటు ప్రాజెక్టుల్లో రిజర్వాయర్ లలో నీటిని సకాలం లో నింపక పోవడం తద్వారా పంటల సాగు ముందుకు సాగక రైతులు తీవ్ర ఆందోళన లో ఉన్న విషయం లేఖలో పేర్కొన్నారు.. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలన వచ్చే వరదను తద్వారా ప్రతి నీటి చుక్కని ఒడిసి పట్టి సకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ లను ఆన్ చేసి రైతుల ప్రయోజనాల దృష్ట్యా నీటి పంపింగ్ ప్రారంభించాలని రైతుల పక్షాన డిమాండ్ హరీష్ రావు లేఖ ద్వారా డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో అంతర్భాగం అయిన మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టిఎంసి లు, ప్రస్తుతం సుమారు 22 టిఎంసి ల నీటి లభ్యత ఉందని అదేరకంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వలన గోదావరి లోని వరద నీటి లభ్యత కూడా ఏర్పడనుందన్నారు. ఇట్టి విషయం దృష్టిలో ఉంచుకొని మిడ్ మానేరు నుండి మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ ప్రారంభించాలని, తద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు లో అంతర్భాగమైన అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్,కొండపోచమ్మ సాగర్, నృసింహ బస్వాపూర్ తదితర రిజర్వాయర్ లను, వాటి పరిధిలోని చెరువులను, చెక్ డ్యామ్ ల అన్నింటిని నింపి సుమారు 4లక్షల ఎకరాల కు నీరందించేలా చర్యలు చేపట్టలన్నార రైతు సాగు ప్రయోజనాలు తీర్చడానికి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా నీటి పంపింగ్ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నానని లేఖ ద్వారా చెప్పారు.



# బరి తెగించిన విద్యాసంస్థలు...

హైదరాబాద్, జనసమయం; ఇది మామూలు మోసం కాదు. వాళ్లు మామూలు వ్యక్తులు కాదు. చేసిన పన్నాగం అంతకుమించిన స్థాయిలో ఉంది. వాళ్ళు ఏకంగా హైడ్రా రంగనాథ్ కే టోపీ పెట్టారు. హైదరాబాద్ నగరంలో ఆక్రమణలు లేకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేసింది.. దీని ద్వారా చెరువులను.. కుంటలను.. నాలాలాను కాపాడే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో హైడ్రా వ్యవస్థ అత్యంత దూకుడుగా పని చేస్తోంది. హైడ్రా కమిషనర్ గా రంగనాథ్ ఆక్రమణల విషయంలో ఉక్కు పాదం మోపుతున్నారు. ఏ మాత్రం దాన్ని కదుగు వేయకుండా ఆక్రమణలను పడగొడుతున్నారు. చెరువులను కాపాడుతున్నారు. ప్రకృతి వనరులను సంరక్షిస్తున్నారు. హైడ్రా రంగనాథ్ చేస్తున్న మంచి పనులను కొంతమంది జీర్ణించుకోలేకపోతున్నారు. అక్రమార్కులు కోర్టులలో పిటిషన్లు దాఖలు చేసి.. ఆయన కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారు. ప్రభుత్వ లక్ష్యం మీద నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. అక్రమార్కుల వ్యవహార శైలి ఇలా ఉంటే.. కార్పొరేట్ కాలేజీ నిర్వాహకుల తీరు మరో విధంగా ఉంది. వీరు ఏకంగా ఫైర్ ఎన్ఓసిపై రంగనాథ్ కే టోపీ పెట్టారు. సంతకాలు ఫోర్జరీ చేశారు. ఏకంగా ఇంటర్ బోర్డుకు సబ్మిట్ చేశారు. అధికారులు సంతకం ఫోర్జరీ జరిగిందని విచారణలో గుర్తించారు. ఆ ఎనిమిది కాలేజీలకు సంబంధించిన గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు ఇప్పటికే ఫిర్యాదు అందింది. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ 8 కాలేజీ ల మీద లేక్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.




బర్కత్పురా ప్రాంతానికి చెందిన హైందవి జూనియర్ కాలేజీ.. ఎస్ ఆర్ నగర్ కు చెందిన రేసోనన్స్ జూనియర్ కాలేజీ.. మెహదీపట్నం కి చెందిన ప్రియాంక జూనియర్ కాలేజీ.. విద్యానగర్ ప్రాంతానికి చెందిన మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజీ.. చాంద్రాయణ గుట్ట ప్రాంతానికి చెందిన శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ.. చిక్కడపల్లికి చెందిన న్యూ ఎరా కాలేజీ.. శివరాంపల్లికి చెందిన షాహీన్ జూనియర్ కాలేజీ.. తెల్లాపూర్ ప్రాంతానికి చెందిన వశిష్ట జూనియర్ కాలేజీ నిర్వాహకుల మీద పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంకా 60 కాలేజీల ఎన్ఓసి లను కూడా స్క్రూటినీ చేస్తున్నట్టు పోలీసు అధికారులు ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో ఫైర్ ఎన్ఓసి జారీ చేసే విషయంలో హైడ్రా అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. అన్ని నిబంధనలు పాటించిన కాలేజీలకు మాత్రమే ఎన్వోసీ ఇస్తోంది. కాలేజీ గుర్తింపు రద్దు అవుతుంది. అందువల్లే కాలేజీ యాజమాన్యాలు ఈ దుర్మార్గానికి పాల్పడ్డాయి. హైడ్రా రంగనాథ్ కు ఏకంగా టోపీ పెట్టిన ఈ కాలేజీ యాజమాన్యాల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కాలేజీ యాజమాన్యాల మీద ఇప్పటికే పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఉపక్రమిస్తున్నారు.

# 80 ఏళ్ల భారతవని...

## ఎన్నో మార్పులు... అయినా.. ఇంకా...

భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో, ప్రజల ఆర్థిక అలవాట్లలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ప్రాథమిక అవసరాలకే పరిమితమైన కుటుంబాలు, ఇవాళ ప్రీమియం ఉత్పత్తులు, విదేశీ ప్రయాణాలు, వినోదంపై ఖర్చు చేస్తున్నాయి. స్థిరత్వం కోసం బ్యాంకు డిపాజిట్లపై ఆధారపడే స్థాయి నుండి, సంపద సృష్టి కోసం ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టే స్థాయికి భారతీయ మధ్యతరగతి వర్గం అద్భుతంగా ఎదిగింది. భారత్ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందినప్పుడు, పేదరికం, నిరక్షరాస్యత, ఆహార అభద్రత ఎక్కువగా ఉండేవి. ఆ కాలంలో సగటు కుటుంబాల ఇంటి వినియోగం కేవలం నిత్యావసరాలకు మాత్రమే పరిమితమై ఉండేదని ఆర్థికవేత్తల అంచనాలు చెబుతున్నాయి. కానీ 79 ఏళ్ల ఈ చారిత్రక ప్రయాణంలో భారతీయ ఆర్థిక వ్యవస్థ ఎంతో వృద్ధి చెందింది. ఒకప్పుడు స్కూటర్ కొనాలని ఆశపడిన కుటుంబం, ఇప్పుడు ఆధునిక ఎలక్ట్రిక్ కార్ల కోసం చూస్తోంది. ఇప్పుడు ప్రజల ఆర్థిక ఆకాంక్షలు స్థిరత్వాన్ని పొందడం నుండి, పెట్టుబడుల ద్వారా చురుకుగా సంపదను సృష్టించడం వైపు గణనీయంగా మారాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

కొరత నుండి ఎంపిక వరకు...

ఒకప్పుడు సగటు భారతీయుడి ఆర్థిక ఆకాంక్షలు కేవలం కూడు, గుడ్డ, ఇల్లు సంపాదించడంపైనే కేంద్రీకృతమై ఉండేవి. ఇవాళ పెరుగుతున్న ఆదాయాలు, వేగవంతమైన పట్టణీకరణ, డిజిటల్ వేదికల కారణంగా కుటుంబాలకు అనేక రకాల ఆప్షన్లు అందుబాటులోకి వచ్చాయి. తాజా సర్వే గణాంకాల ప్రకారం, గ్రామీణ, పట్టణ కుటుంబాల ఖర్చుల మధ్య అంతరం కూడా వేగంగా తగ్గుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కేవలం కడుపు నిండా తినడానికి చేసే ఖర్చుల వాటా క్రమంగా తగ్గి, మిగిలిన డబ్బును రవాణా, వినోదం, గృహవసతి, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, ఎలక్ట్రానిక్స్ వస్తువుల కోసం ఉపయోగిస్తున్నారు.

సామూహిక వినియోగం నుండి ప్రీమియం వరకు...

ఆటోమొబైల్ రంగంలో సైతం వినియోగదారుల ఆలోచనా విధానంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వినియోగదారులు కేవలం అత్యంత చౌకైన ఎంట్రీ-లెవల్ వాహనాల కోసం చూడకుండా, వాడిన కార్ల మార్కెట్‌లో కూడా ప్రీమియం వేరియంట్లు , మెరుగైన సౌకర్యాలున్న ఎస్‌యూవీలను కొనుగోలు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్ల విషయంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. ఉదాహరణకు, రూ.30 వేలుపైబడిన ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ల మార్కెట్ వాటా 2020లో 20% ఉండగా, 2025 నాటికి అది 26%కి గణనీయంగా పెరిగింది.

పెరుగుతున్న ప్రయాణాలు, వినోద ఖర్చులు

ఒకప్పుడు కేవలం కొద్దిమందికి మాత్రమే పరిమితమై, విలాసంగా భావించిన అంతర్జాతీయ విదేశీ ప్రయాణాలు.. ఇప్పుడు మధ్యతరగతి ప్రజలకు సాధారణ ఖర్చుగా మారిపోయాయి. పర్యాటక శాఖ లెక్కల ప్రకారం 2025లో భారత పౌరులు రికార్డు స్థాయిలో 32.83 మిలియన్ల విదేశీ పర్యటనలు చేశారు. మరోవైపు సంగీత కచేరీలు, క్రీడా కార్యక్రమాలు, లైవ్-ఈవెంట్స్ కోసం కూడా ప్రజలు ఇప్పుడు చాలా ఎక్కువ డబ్బును వెచ్చిస్తున్నారు.

పొదుపు నుండి పెట్టుబడుల వైపు...

# కాంగ్రెస్ వైపు యువత మారుతోందా



హైదరాబాద్,జనసమయం;తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జెన్ జీకి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో యువతను ఆకట్టుకునేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి జెన్ జీ నేతలతో తరచూ సమావేశమవుతున్నారు. వారి సమస్యలను తెలంగాణలో పరిష్కరించడమే కాకుండా వారు ఎన్నికల్లో పోటీ చేసే వయసు విషయంలోనూ వయసును తగ్గించాలని ఇటీవల రేవంత్ రెడ్డి డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరిసిస్తూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద యువత ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. రాష్ట్రంలోనూ యువ ఓటర్లకు గాలం వేయాలన్న ప్లాన్ లో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో సీనియర్ నేతలను పక్కన పెట్టి యువతకు సీట్లు కేటాయించేలా ఢిల్లీ పర్యటనలో పార్టీ హైకమాండ్ ను ఒప్పించనున్నారని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చట్టసభల్లో 'జెన్ జీ' యువతకు ప్రాతినిధ్యం పెరగాలని, పోటీ చేసే వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరడం ద్వారా యువత దృష్టిని ఆకర్షిస్తున్నారు. భవిష్యత్ రాజకీయాల్లో యువత పాత్ర కీలకం అని ఆయన భావిస్తున్నారు. అయితే, విద్యార్థుల నైపుణ్యాలపై ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు రాష్ట్రంలో రాజకీయ చర్చకు దారితీశాయి.రేవంత్ రెడ్డి వ్యూహం మరియు ప్రాధాన్యతలు యువత వైపు ఇటీవల కాలంలో కనిపించడం రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. చట్టసభల్లో జెన్ జీ యువతకు అవకాశం కల్పించాలని ప్రతిపాదన ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో పెట్టనున్నారు. ఈ తీర్మానం తెలంగాణ అసెంబ్లీలో చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి బీజేపీని కూడా ఇరుకున పెట్టే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ఉన్నట్లు కనపడు?ది. ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 21 ఏళ్లకు కుదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో యువ నాయకులకు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారికి ప్రాధాన్యత ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు తెచ్చేలా ఒత్తిడి తెచ్చే వ్యూహంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. యువత ఆలోచనలకు అనుగుణంగా రాజకీయ వ్యూహాలు అమలు చేయడం ఇప్పుడు తెలంగాణలో రాజకీయంగా చర్చ జరుగుతుంది. ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ను బలోపేతం చేయడమే కాకుండా దేశంలోని యువత మొత్తాన్ని కాంగ్రెస్ వైపు మళ్లించి వచ్చే ఎన్నికల నాటికి దేశంలోకాంగ్రెస్ పార్టీకి దగ్గర చేయాలన్న స్ట్రాటజీ రేవంత్ చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఇరుకున పెట్టేందుకు ఇది మరింత ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.

# బండికి కీలక బాధ్యతలు...

తెలంగాణలో ఏలాగైనా అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే రాబోయే అసెంబ్లీ సమరానికి పార్టీని సిద్ధం చేసేందుకు నేతృత్వంలో మార్పులు ఉంటాయా, లేక ప్రస్తుత సారథ్యాన్నే కొనసాగిస్తారా అనే అంశం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును తప్పించి, గతంలో పార్టీని పరుగులు తీటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాజకీయ వర్గాల్లో బండి సంజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ, బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి మాత్రం నాయకత్వ మార్పుపై స్పష్టమైన సంకేతాలేవీ వెలువడలేదు. షెడ్యూల్ ప్రకారం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2028లో జరగాల్సి ఉంది. ఒకవేళ కేంద్రం ప్రతిపాదిస్తున్న 'జమిలి' విధానం అమల్లోకి వస్తే, ఇవి 2029 మే లేదా జూన్ నాటికి మారే అవకాశం ఉంది. ఈ లెక్కన ప్రస్తుత అధ్యక్షుడు రాంచందర్ రావు పదవీకాలం ఇంకా సుమారు రెండేళ్లకు పైగా ఉంది. ఎన్నికలకు ఇంకా తగినంత సమయం ఉన్నందున, ఇప్పుడు హడావుడిగా అధ్యక్షుడిని మార్చడం వల్ల పార్టీలో నూతన అసంతృప్తులు, సమన్వయ లోపాలు తలెత్తే ప్రమాదం ఉందని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో కేవలం బండి సంజయ్ మాత్రమే కాకుండా మరికొందరు అగ్రనేతలు కూడా ఉన్నారు. తెలంగాణలో బీజేపీని దూకుడుగా ముందుకు తీసుకెళ్లిన అనుభవం బండి సంజయ్ కి ఉంది. కార్యకర్తలలో ఉన్న విపరీతమైన క్రేజ్, అధికార పార్టీకి గట్టి పోటీ ఇవ్వగలరనే నమ్మకం ఆయనకు సానుకూల అంశాలు. ఇక ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు కూడా పార్టీ అధ్యక్ష పీఠం ఆశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో



మంచి పట్టున్న ఈ సీనియర్ ఎంపీలు కూడా అధ్యక్ష బాధ్యతల కోసం జాతీయ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే నూతన అధ్యక్షుడిని నియమిస్తే, ఆయన రాష్ట్రవ్యాప్తంగా పార్టీపై పూర్తి పట్టు సాధించడానికి కొంత సమయం పడుతుంది. ఈ విరామం ఎన్నికల సమయానికి పార్టీకి ప్రతికూలంగా మారవచ్చని కొందరు విశ్లేషిస్తున్నారు. అందుకే అధ్యక్షుడిని మార్చడం కంటే, రాంచందర్ రావునే పదవిలో కొనసాగిస్తూనే.. రేసులో ఉన్న ఇతర కీలక నేతలకు వివిధ కీలక బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేయడం, బలమైన సామాజిక వర్గాలను బీజేపీ వైపు తిప్పుకోవడం, నాయకుల మధ్య సమన్వయాన్ని పెంచడంపైనే పార్టీ దృష్టి సారిస్తోంది. మొత్తానికి, బండి సంజయ్ లేదా ఇతర నేతల పేర్లు ఎంతగా ప్రచారంలో ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి రాంచందర్ రావు నేతృత్వంలోనే కమలనాథులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 'జమిలి' నిర్ణయం, మారే రాజకీయ సమీకరణాలను బట్టి చివరి నిమిషంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి!

# ఒక బిడ్డ 18 ఏళ్ల ఖర్చు 1.89 కోట్లా...



హైదరాబాద్, జనసమయం;ప్రస్తుతం దేశంలో ప్రతీ ఒక్కటి ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో యువత పెళ్లిళ్లు అంటేనే ఆమడ దూరం పారిపోతున్నారు. ఇక పెళ్లిళ్లు చేసుకున్న వారు పిల్లలను కనాలంటేనే ఖర్చులు లెక్కేస్తున్నారు. ఒక్కరు ముద్దు, అసలే వద్దు అంటూ పిల్లల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్‌లో ఒక బిడ్డను 18 ఏళ్ల వరకు పెంచాలంటే ఎంత ఖర్చు అవుతుందనే అంశంపై కంటెంట్ క్రియేటర్ విఖ్యాత్ సింగ్ చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి.. పిల్లలు పుట్టి, 18 ఏళ్లు వచ్చే వరకు వారికి అయ్యే ఖర్చులను లెక్కించాడు.ఒక కుటుంబం ఒక్కో బిడ్డకు సుమారు రూ. 1.39 కోట్లు వెచ్చించాల్సి వస్తుందని విఖ్యాత్ సింగ్ అంచనా వేశారు. ద్రవ్యోల్బణం, ఉన్నత విద్య ఖర్చులు, పెట్టుబడులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ మొత్తం కాస్తా.. రూ.2 కోట్లకు పైగా చేరవచ్చని పేర్కొన్నారు. గర్భధారణ, డెలివరీ, మెడికల్ టెస్టులు, మందులు వంటి ఖర్చులకు సుమారు రూ.3 లక్షలు అవసరమవుతాయని విఖ్యాత్ సింగ్ చెప్పారు. పుట్టిన తర్వాత తొలి 2 ఏళ్లలో డైపర్లు, టీకాలు, ఫుడ్, ఇతర అవసరాల కోసం మరో రూ.6 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు.2 ఏళ్ల వయసు నుంచి 18 ఏళ్ల వరకు పిల్లల ఆహారానికి మొత్తంగా రూ.15 లక్షలు ఖర్చు పెట్టాలని విక్రాంత్ సింగ్ తెలిపారు. వారి విద్యకు ప్లే స్కూల్ నుంచి స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, ట్రిప్స్ కలిపి ఇంకో రూ.33 లక్షలు అవసరమవుతాయని లెక్కించారు. ఇక ట్యూషన్లకు రూ.9 లక్షలు.. ఆరోగ్య సంరక్షణకు రూ.5.4 లక్షలు.. ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రూ.9 లక్షలు.. బట్టలకు రూ.7.2 లక్షలు.. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు రూ.4 లక్షలు.. స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్లకు రూ.8 లక్షలు.. రవాణాకు రూ.8 లక్షలు.. పిల్లలు పుడితే పెద్ద ఇంట్లో నివసించాల్సిన అవసరం వస్తుందని అందుకు అదనంగా అద్దెకు రూ.32.4 లక్షలు ఖర్చవుతుందని వివరించారు.ఈ క్రమంలోనే విఖ్యాత్ సింగ్ విడుదల చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. విఖ్యాత్ సింగ్ చెప్పినట్లు పిల్లల పెంపకం ప్రస్తుతం ఆర్థికంగా ఎంతో భారంగా మారిందని కొందరు నెటిజన్లు అంగీకరిస్తూ పోస్టులు పెడుతున్నారు. కానీ మరికొందరు మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నారు. అన్నీ డబ్బుతోనే ముడిపెట్టకూడదని హితవు పలుకుతున్నారు. పిల్లలు ఇచ్చే ఆనందం, ప్రేమ, కుటుంబానికి వచ్చే సంతోషాన్ని ఎంత డబ్బుతో అయినా కొలవలేమని పేర్కొంటున్నారు. పిల్లల వల్ల కలిగే ఆనందానికి ఎలాంటి విలువ కట్టలేమని పలువురు నెటిజన్లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు

# బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్...



హైదరాబాద్, జనసమయం;హైదరాబాద్ మహానగరంలో సొంతింటి కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న పేద, దిగువ మధ్యతరగతి ప్రజలను మరోసారి రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా స్కెచ్ వేసింది. నగర నడిబొడ్డున ఇందిరమ్మ టవర్స్ పేరుతో రూ. 40 నుంచి రూ. 60 లక్షల విలువైన ఫ్లాట్లను కేవలం రూ. 6 లక్షలకే ఇస్తామంటూ సరికొత్త సెంటిమెంట్ రగిలిస్తోంది. రూ. 5 లక్షల సబ్సిడీ, రిజర్వేషన్ల శాతం, మీ-సేవ దరఖాస్తులు అంటూ సుదీర్ఘమైన నిబంధనల జాబితాను ప్రకటిస్తూ.. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ స్కీమ్ తెరపైకి తెచ్చారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.గతంలో కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి, లక్షలాది మంది నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఓట్ల పండగ ముగిశాక పేదలను నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన అరకొర ఇళ్లకు పరిమితం చేసింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే కేసీఆర్ ఫార్ములా ను కాస్త రూపుమార్చి అమలు చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఉచితం అని చెప్పకుండా.. రూ. 6 లక్షల భాగస్వామ్యం పేరుతో ప్రజల నుంచి ఆశలు రేకెత్తించి, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి ఈ దరఖాస్తుల హంగామా అని ఎక్కువ మంది నమ్ముతున్నారు.ప్రస్తుతం తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో ఈ ఇందిరమ్మ టవర్స్ కడతామని చెబుతున్న ప్రభుత్వం, అసలు ఇళ్లకు సరిపడా భూములు ఎక్కడ ఉన్నాయో స్పష్టం చేయడం లేదు. పార్టీ చేస్తున్న విమర్శలను విష ప్రచారం అని కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ నేతలు, గత ప్రభుత్వం చేసిన పాత తప్పులనే మళ్లీ పునరావృతం చేస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. మీ-సేవ కేంద్రాలు, వాట్సాప్ నంబర్లు ఇచ్చి దరఖాస్తులు తీసుకోగానే సరిపోదని, అసలు ఇళ్లు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పకుండా ఓటర్లను భ్రమల్లో ఉంచడమే కాంగ్రెస్ వ్యూహమన్న విమర్శలు ఉన్నాయి.గతంలో చూపించిన డబుల్ బెడ్‌రూమ్ డ్రీమ్ ఎలాగైతే ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నారో ఇప్పుడు ఇందిరమ్మ టవర్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహా పథకాన్ని అమలు చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేదవాడికి నిజంగా ఇల్లు అందుతుందా లేదా అన్నది పక్కనబెడితే.. గ్రేటర్ ఎన్నికల వేళ ఈ ఇందిరమ్మ ఇళ్ల ప్రకటన మాత్రం హైదరాబాద్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర కలకలం రేపుతోంది.

# గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలి

## మంత్రి శ్రీధర్ బాబు



26 జూన్ 2027 నుంచి 7 జూలై 2027 వరకు గోదావరి నది తీరం పుష్కర శోభతో విరాజిల్లేలా, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని గోదావరి పుష్కరాల పై ఏర్పాటు చేసిన కేబినేట్ సబ్ కమిటి సంకల్పించింది. పుష్కరాల సందర్భంగా గోదావరి తీరం వెంబడి ఘాట్ల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేసి, దేశం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ దిశగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి డి. శ్రీధర్బాబు అధ్యక్షతన జరిగిన కీలక సమావేశం అధికారులకు స్పష్టమైన దిశా నిర్దేశం చేసింది. ఈ సమావేశంలో మంత్రులు శ్రీమతి కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, పలు శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. 26 జూన్ 2027 నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, వివిధ శాఖల సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో కేబినేట్ సబ్ కమిటి చైర్మన్ శ్రీధర్ బాబు నేతృత్వంలోని మంత్రుల బృందం కూలంకషంగా చర్చించింది. దేవాదాయ శాఖ, ఆర్ అండ్ బి, నీటిపారుదల, పోలీస్, టూరిజం, టిజిఎస్పిడిసిఎల్, వైద్యారోగ్యం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్టమెంట్, గ్రామీణ నీటిపారుదల తదితర శాఖలు చేపడుతున్న పనుల వివరాలను మంత్రుల బృందం ఆరా తీసింది. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లు, శాఖల వారీగా కొనసాగుతున్న పనుల పురోగతిని అధికారులు మంత్రులకు వివరించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, రవాణా, విద్యుత్, వైద్య, భద్రత తదితర సదుపాయాల కల్పనపై మంత్రులు ప్రత్యేకంగా శాఖల వారీగా చర్చించారు. పుష్కరాల ప్రారంభానికి ముందే అన్ని పనులను నాణ్యతతో, సమన్వయంతో పూర్తి చేసి భక్తులకు ఆధ్యాత్మిక, ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నదీ తీరాన వున్న నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పుష్కర ఘాట్లుగా తీర్చిదిద్దనున్న మొత్తం 67 కేంద్రాలను 3 అంచెల్లో అభివృద్ధి చేయనున్నట్లు కమిటి కన్వీనర్, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ మంత్రుల బృందానికి వివరించారు. గోదావరి పుష్కరాల సమగ్ర ఏర్పాట్ల కోసం రూ. 1000 కోట్లతో వివిధ శాఖల పరిధిలో పనులు జరుగుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కేబినేట్ సబ్ కమిటి చైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల పనుల పురోగతిని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.

# బిగ్ ప్లాన్‌లో బీజేపీ



హైదరాబాద్, జనసమయం;తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత పట్టు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కమలనాథులు, ఈసారి ఎలాగైనా తెలంగాణ గద్దెనెక్కాలనే స్పష్టమైన దిశానిర్దేశంతో ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమక్షంలో జరిగిన కీలక సమీక్షా సమావేశం, రాబోయే రోజుల్లో బీజేపీ అనుసరించబోయే రాజకీయ వ్యూహానికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది.తెలంగాణ బీజేపీకి ప్రధాన ప్రతిబంధకంగా మారిన పాత, కొత్త నేతల మధ్య విభేదాలను, అంతర్గత కలహాలను వెంటనే పక్కన పెట్టాలని పార్టీ అధిష్ఠానం స్పష్టం చేసింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, రఘునందన్ రావు సహా ముఖ్య నేతలందరూ ఒకే తాటిపైకి వచ్చి పోరాడాలని అధిష్టానం స్పష్టం చేసింది. గతంలో కరీంనగర్, మేడ్చల్ అర్బన్, వికారాబాద్ జిల్లాల పార్టీ అధ్యక్షుల నియామకంపై నలుగుతున్న వివాదాలను సైతం బండి సంజయ్, ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డిల సూచనలకు ప్రాధాన్యం ఇస్తూ సర్దుబాటు చేయడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఐక్యతను నింపే ప్రయత్నం జరిగింది.భవిష్యత్తులో బిఆర్ఎస్ లేదా ఇతర పార్టీలతో పొత్తులు ఉంటాయనే ప్రచారాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముగింపు పలికారు. రాబోయే ఎన్నికల్లో జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికల్లోనైనా తెలంగాణలో ఏ ఇతర పార్టీతోనూ పొత్తు ఉండదని, ఒంటరిగానే పోటీ చేస్తామని తేల్చి చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో సమీకరణాలు వేరైనా, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ స్వయం సమృద్ధి దృష్ట్యా ఒంటరి పోరాటమే శ్రేయస్కరమని పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో గణనీయమైన ఓటు బ్యాంకు సాధించామని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం సీట్ల సంఖ్య పెరిగితే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత సత్తా సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని క్షేత్రస్థాయికి

తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, యువత సమస్యలపై పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో ధర్నాలు, నిరసనలు చేపడుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలైన 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' వంటి ఫలాలను పేదలకు చేరకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. మండల స్థాయి నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ప్రతి నెలా నిలకడగా సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతీ మూడు నెలలకోసారి కేంద్రీయ నేతలు రాష్ట్రాన్ని సందర్శించేలా పక్కా ప్రణాళిక రూపుదిద్దుకుంది. నేతల మధ్య ఉన్న చిన్న చిన్న భేదాభిప్రాయాలు పక్కనబెట్టి, వ్యూహాత్మకంగా ముందుకు సాగితే తెలంగాణ పీఠం దక్కడం అసాధ్యమేమీ కాదని కమలనాథులు భావిస్తున్నారు.

**బండి సంజయ్ నివాసంలో సమావేశాలు..**

బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాజకీయాల్లో మరో మలుపు తీసుకుంటూ వ్యూహాత్మకంగా కదులుతోంది. ఒకవైపు వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్, గుజరాత్‌లో గెలుపుపై దృష్టి సారించిన కమలం పార్టీ మరోవైపు దరక్షిణాన పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా కర్ణాటక తర్వాత గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో పార్టీలో జోష్ పెంచడంతోపాటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేలా వ్యూహాలు రూపొందిస్తోంది. త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ పోరులో విజయం సాధించాలనే లక్ష్యంతో కేంద్ర స్థాయి నుంచి స్పష్టమైన దిశానిర్దేశం జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీని వేదికగా రాష్ట్ర నాయకుల సమావేశాలు జరగడం, పార్టీలో సమన్వయాన్ని పెంచే ప్రయత్నాలు ఈ వ్యూహానికి ప్రధాన అంశాలుగా మారాయి. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండింటిలోనూ బలమైన పనితీరు చూపాలనే ఆలోచనతో బీజేపీ అధిష్టానం పని చేస్తోంది. హైదరాబాద్‌లోని మున్సిపల్ ఎన్నికలు పార్టీకి కీలక పరీక్షగా మారనున్న నేపథ్యంలో, రాష్ట్ర స్థాయి నాయకత్వం, కార్యకర్తల సమన్వయం, సంస్థాగత బలం పెంచే దిశగా చర్చలు సాగుతున్నాయి. కేవలం ఎన్నికల క్యాంపెయిన్‌కు మాత్రమే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక రాజకీయ బలాన్ని నిర్మించే దృష్టితో వ్యూహాలు రూపొందుతున్నట్లు అర్థమవుతోంది. ఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసం రాష్ట్ర నాయకుల సమావేశాలకు ముఖ్య వేదికగా మారింది. ఇక్కడ జరుగుతున్న చర్చలు కేవలం సాధారణ సమావేశాలుగా కాకుండా, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలకు దారితీస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నాయకులు, కేంద్ర నాయకత్వం మధ్య నేరుగా సంప్రదింపులు జరగడం వల్ల సమస్యలను త్వరగా గుర్తించి, పరిష్కార మార్గాలు చర్చించే అవకాశం ఏర్పడుతోంది. ఇది పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్‌ను తగ్గించే దిశగా ఉన్నట్లు కనిపిస్తోంది. పార్టీలోని వర్గ విభేదాలను అధిగమించి, ఐక్యంగా ముందుకు సాగాలనే సందేశం అధిష్టానం నుంచి స్పష్టంగా వస్తోంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో జరిగిన చర్చల్లో ఈ అంశం ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయం సాధించాలంటే అంతర్గత సమస్యలు అడ్డంకిగా మారకూడదనే అవగాహనతో, నాయకుల మధ్య సమన్వయం పెంచే చర్యలు చేపట్టబడుతున్నాయి. ఇది పార్టీ సంస్థాగత బలాన్ని పెంచి, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే అవకాశం కలిగిస్తుంది. ఢిల్లీలో జరుగుతున్న ఈ కదలికలు తెలంగాణలో బీజేపీ స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసే ప్రయత్నంగా భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు అంతర్గత ఐక్యతను నిర్ధారించుకోవడం, స్పష్టమైన బాధ్యతల పంపిణీ, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం వంటివి ఇప్పుడు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ వ్యూహం ఎంతవరకు ఫలితాలు ఇస్తుందనేది రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్షాల పనితీరు, ప్రజా స్పందనపై ఆధారపడి ఉంటుంది.

# 95 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ కు గ్రీన్‌సిగ్నల్




హైదరాబాద్, జనసమయం;ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటులో కీలక ముందడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 టీపీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇప్పటికే తొలి మోడల్ పాఠశాలగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో ఏర్పాటు చేసిన స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందించేలా సదుపాయాలు కల్పించారు. తాజాగా మరో 95 పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. వీటి నిర్మాణానికి మొత్తం రూ.928 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో పాఠశాలకు భూమి, భవన పరిమాణం, మౌలిక సదుపాయాలను బట్టి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు ఖర్చు కానుంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అంచనాలు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపించారు. 95 పాఠశాలల నిర్మాణాలకు అవసరమైన పరిపాలనా అనుమతుల కోసం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యమంత్రి ఆమోదం అనంతరం ఉత్తర్వులు వెలువడితే టెండర్ల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా పనులు మొదలుపెట్టి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా 2027-28 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయాలన్న నిర్ణయం నేపథ్యంలో టీపీఎస్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ పాఠశాలలకు అవసరమైన నిధుల్లో 70 శాతం, అంటే సుమారు రూ.650 కోట్లను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణం ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మిగిలిన 30 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించనున్నారు. విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏఐఐబీ, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి భారీగా రుణాలు సమీకరించే ప్రణాళికలో భాగంగానే ఈ నిధులను వినియోగించనుంది. రుణం అందడంలో ఆలస్యం ఏర్పడినా పనులు ఆగిపోకుండా రాష్ట్ర నిధులతో తొలిదశ నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. ఏఐఐబీ తరఫున కన్సల్టెన్సీ ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తూ సంబంధిత అధికారులతో ప్రాజెక్టు అమలు, మౌలిక సదుపాయాలు, నిర్మాణ ప్రమాణాలపై చర్చలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. టీపీఎస్‌లను కేవలం పాఠశాల భవనాలుగా కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువైన క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందించేలా మౌలిక వసతులు కల్పించనున్నారు. తరగతి గదులతోపాటు డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, లైబ్రరీలు, ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలను కల్పించనున్నారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే ఆధునిక తరగతి గదులు, లైబ్రరీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు, క్రీడా వసతులు, ఉచిత రవాణా వంటి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించడంతోపాటు పాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టే దిశగా కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇప్పటికే అచ్చంపేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు రెండేసి టీపీఎస్‌లు మంజూరు కాగా.. గజ్వేల్‌కు కూడా పాఠశాలను కేటాయించారు. ఆరుట్లలో ప్రారంభమైన తొలి టీపీఎస్ నమూనాగా మిగిలిన పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా 100 టీపీఎస్‌ల ఏర్పాటుతో ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంచి, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.



# ప్లాన్ బీలో రేవంత్..కర్ణాటక ఎఫెక్ట్...

హైదరాబాద్, జనసమయం;పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు, ఆ తదుపరి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కాంగ్రెస్ హైకమాండ్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఒక కీలకమైన పాఠాన్ని నేర్పుతోంది. ముఖ్యమంత్రిగా డి.కె. శివకుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన కేబినెట్ విస్తరణలో కొత్తవారికి, యంగ్ లీడర్లకు అవకాశం కల్పిస్తూ 19 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ, బెర్త్‌లు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలు రాజీనామా బాట పట్టడం కర్ణాటక కాంగ్రెస్‌లో తీవ్ర అలజడి సృష్టించింది. సీనియర్లు, మాజీ మంత్రులు బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కడమే కాక, ఎమ్మెల్యే పదవులకూ వీడ్కోలు పలికే వరకు పరిస్థితి దాటిపోవడంతో.. వారిని చల్లార్చేందుకు నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ ఛైర్మన్ గిరీలతో సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేయాల్సి వస్తుంది. కర్ణాటక పరిణామాలను అత్యంత సమీపంగా పరిశీలించిన తర్వాత, తెలంగాణలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ , రేవంత్ రెడ్డి ఉవని జి ఆశయాలకు అనుగుణంగా చేయాలనుకుంటున్న మార్పులపై అధిష్ఠానం ఆలోచనా విధానం పూర్తిగా మారింది. తెలంగాణలో ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న బెర్త్‌ల భర్తీతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పు లేదా కుదింపుపై ప్రచారం జరుగుతున్న తరుణంలో.. కర్ణాటక తరహా అసమ్మతి సెగలు హైదరాబాద్‌లో రగులుకోకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యలు అవసరమని రేవంత్ రెడ్డి గ్రహించారని అనుకోవచ్చు. తెలంగాణ కాంగ్రెస్‌లోనూ సీనియర్లు, సీనియర్ రీజినల్ లీడర్లు కేబినెట్ బెర్త్‌ల కోసం తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. రెడ్డి, బిసి, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ సామాజిక వర్గాల నుంచి అనేకమంది



ఆశావహులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేశారు. రేవంత్ రెడ్డి తన నిర్ణయాల్లో యువ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే కర్ణాటకలో మాదిరిగానే ఎమ్మెల్యేల తిరుగుబాటు లేదా సహాయ నిరాకరణ పెరిగే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వినిపిస్?తంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీమ్ సామాజిక సమతుల్యత + కాంపెన్సేషన్ ప్యాకేజీ వ్యూహాన్ని తెరపైకి తెస్తున్నారు. కేవలం కేబినెట్ బెర్త్‌లు ఇవ్వడమే కాకుండా, పదవులు రాని ముఖ్య నేతలకు ముందే స్పష్టత ఇచ్చి, వారికి పవర్ ఫుల్ నామినేటెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, జిల్లా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు, లేదా ప్రభుత్వ సలహాదారు పాత్రలను ఆఫర్ చేయడం ద్వారా ముందస్తుగానే అసంతృప్తికి చెక్ పెట్టాలని భావిస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియ కేబినెట్ విస్తరణకు ముందే పూర్తయితే, ప్రమాణ స్వీకారం రోజున డ్రామాలు జరగకుండా నివారించవచ్చనేది కాంగ్రెస్ ప్లాన్. అంతేకాకుండా, సామాజిక సమీకరణల పరంగా ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యాన్ని దెబ్బతీయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఉదాహరణకు ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల మధ్య కాంబినేషన్ దెబ్బతింటే అది ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం చూపుతుంది.కర్ణాటకలో డి.కె. శివకుమార్ ఓపిక పడితే అవకాశాలు వస్తాయి అని సర్దిచెప్పాల్సి వచ్చిన పరిస్థితిని తెలంగాణలో రాకుండా చూడాలంటే.. విస్తరణ రోజునే ఎవరికి ఏ పదవి లభిస్తుందో స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించడం ఒక్కటే సరైన మార్గమని ఏఐసీసీ భావిస్తోంది.

# టార్గెట్ రేవంత్...

తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణల పర్వం కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా నేరుగా విమర్శలు చేయడం కంటే, ఆయన కుటుంబ సభ్యులను, ముఖ్యంగా ఆయన సోదరులను టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. రేవంత్ రెడ్డి సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిలు సాధారణంగా తెర వెనుక ఉంటారు. తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ వ్యవహారాలు చూసుకుంటుండగా, కొండల్ రెడ్డి వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. వీరిద్దరినీ ఇప్పుడు బీఆర్ఎస్ తమ పొలిటికల్ అటాక్‌కు కేంద్రబిందువుగా మార్చుకుంది. తాజాగా ఈ పొలిటికల్ వార్ టెస్సరాక్ట్ అనే కంపెనీకి జరిగిన భూ కేటాయింపుల చుట్టూ తిరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ కంపెనీకి అత్యంత విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టిందని, అసలు ఆ టెస్సరాక్ట్ కంపెనీ కొండల్ రెడ్డి బినామీ సంస్థ అని బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ముఖ్యమంత్రి తన అధికారాన్ని ఉపయోగించి సొంత సోదరుడికి భారీగా లబ్ధి చేకూర్చారని ప్రతిపక్ష నేతలు సోషల్ మీడియా, మీడియాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచార దాడికి దిగారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థాయి స్కామ్‌లకు పాల్పడుతోందంటూ బీఆర్ఎస్ శ్రేణులు నెరేటివ్‌ను బలంగా జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. బీఆర్ఎస్ చేస్తున్న ఈ తీవ్రమైన ఆరోపణలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలోని సీనియర్ నేతలు, మంత్రులు ఎవరూ ఈ వివాదంపై పెద్దగా స్పందించకపోవడం ప్రతిపక్షాల ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాత్రమే ఈ అంశంపై స్పందిస్తూ ప్రభుత్వాన్ని డిఫెండ్ చేసే ప్రయత్నం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక విధానం ప్రకారం ఎలాంటి నిబంధనలతో భూములు కేటాయించారో, ఇప్పుడు కూడా సరిగ్గా అదే చట్టబద్ధమైన రూల్స్ పాటిస్తూ పారదర్శకంగా భూములు ఇచ్చామని, ఇందులో ఎలాంటి తప్పిదాలు జరగలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. అయితే, ఇక్కడే కాంగ్రెస్ వ్యూహాత్మక లోపం బయటపడుతోంది. పారిశ్రామిక అవసరాల కోసం ఇచ్చిన భూములను కేవలం ఆ నిర్దేశిత ప్రాజెక్టులకు, ఫ్యాక్టరీల నిర్మాణాలకు మాత్రమే ఉపయోగించాలి తప్ప, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చుకోవడానికి లేదా అమ్ముకోవడానికి చట్టపరంగా అవకాశం ఉండదు. ఈ పాయింట్‌ను కాంగ్రెస్ నేతలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారు. భూములు ఎవరికి ఇచ్చినా అందులో స్కామ్ చేసే ఆస్కారం లేదని టెక్నికల్‌గా వివరించడంలో అధికార పక్షం విఫలమవుతోంది. సదరు టెస్సరాక్ట్ కంపెనీకి, సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ శ్రేణులు కానీ, ప్రభుత్వ ప్రతినిధులు కానీ ధైర్యంగా ఖండించలేకపోతున్నారు. బీఆర్ఎస్ ప్రధానంగా కొండల్ రెడ్డి పేరును వాడుకుని దీనిని ఫ్యామిలీ స్కామ్ గా బ్రాండ్ చేస్తోంటే.. కాంగ్రెస్ మాత్రం కేవలం విధానపరమైన నిబంధనల గురించి మాత్రమే మాట్లాడుతోంది తప్ప, అసలు ఆ కంపెనీ ఓనర్ల వెనుక కొండల్ రెడ్డి ఉన్నారా లేదా అనే దానిపై క్లారిటీ ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

# 100 ఎకరాల్లో బస్ డిపో



హైదరాబాద్‌లో ట్రాఫిక్ పెరుగుతోంది.. ఎక్కడికక్కడే ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు ఏర్పాటు చేసినా సరే ట్రాఫిక్ మాత్రం తగ్గడం లేదు. మెట్రో రైలుతో పాటుగా ఆర్టీసీ ప్రజా రవాణా అందుబాటులో ఉన్నా సరే ట్రాఫిక్ కష్టాలు మాత్రం కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ నగరంలో వాహనాలకు తోడు తెలంగాణలోని ఇతర జిల్లాలతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు హైదరాబాద్‌కు వస్తున్నాయి. ముఖ్యంగా ఏపీతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ఆర్టీసీ బస్సులు నగరానికి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల కోసంఎంజీబీఎస్, జేబీఎస్ బస్ స్టేషన్‌లు ఉన్నాయి.. అయినా సరే ఒత్తిడి ఏమాత్రం తగ్గడం లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో బస్టాండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.. టీజీఎస్‌ఆర్టీసీ 100 ఎకరాల్లో అత్యాధునిక బస్ టెర్మినల్‌ను ప్లాన్ చేసింది. తాజాగా ఈ డిపోకు సంబంధించి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ జగద్గిరిగుట్ట దగ్గర బస్ డిపో నిర్మాణం కోసం కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం దగ్గర 100 ఎకరాలు కేటాయించినట్లు నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు గడ్కరీ సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ పరిధిలోని జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు కలిపి రోజూ 404 ట్రిప్పుల వరకు తిరుగుతాయన్నారు. టీజీఎస్‌ఆర్టీసీ బస్ డిపో, టెర్మినల్ నిర్మాణం కోసం 99 ఏళ్లకు లీజుకు తీసుకోవడానికి హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని గుర్తించిందన్నారు.కానీ హెచ్‌ఎంటీ అధికారులు.. అంత సుదీర్ఘకాలం స్థలాన్ని లీజుకు ఇవ్వలేమని, 5 ఏళ్లకోసారి చొప్పున గరిష్ఠంగా 20 ఏళ్లకు మాత్రమే ఇస్తామని చెప్పారన్నారు. దీని కోసం ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని చెప్పగా.. ఆ ప్రతిపాదనకు టీజీఎస్‌ఆర్టీసీ అంగీకరించలేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం టీజీఎస్‌ఆర్టీసీకి గాజులరామారం దగ్గర హెచ్‌ఎంటీ భూములకు సమీపంలో 100 ఎకరాలు కేటాయించినట్లు కేంద్రమంత్రి గడ్కరీ తెలిపారు. గాజుల రామారంలో ఏర్పాటు చేయబోయే డిపోలో ఇంటర్ స్టేట్ బస్సు సర్వీసుల కోసం ప్రత్యేకంగా బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్, ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సు కారణంగా ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలు, తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి వచ్చే బస్సులు ఈ డిపోకు వెళ్లనున్నాయి. అప్పుడు ఎలాంటి సమస్య ఉండదని భావిస్తున్నారు

# కాక్రోచ్‌కు నిధులెలా వస్తున్నాయ్...

న్యూఢిల్లీ, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి రోజువారీగా కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి.

పార్టీ నాయకత్వం, దాని వ్యూహాలు, వెనుక ఉన్న శక్తులు, అసలు ప్రణాళిక ఏమిటి అన్న అంశాలపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలు నడిపే వారు సమాజానికి జవాబుదారులుగా ఉండాలని ఆశించే సందర్భంలో, వారి స్వంత నేపథ్యాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది. సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే గురించి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆయన తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, నెలకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయల వేతనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ శంభాజీనగర్‌లో ఉన్న ఆయన భవనం రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైనదిగా అంచనా. ఆ ఇంట్లోని సదుపాయాలు, అక్కడ జరిగిన సమావేశాల్లో మద్యం సరఫరా విధానం, పెద్ద ఎత్తున కార్టన్ల రాకపోకలు వంటి వివరాలు చూస్తే, ఆదాయానికి తగిన జీవనస్థాయి లేదన్న సందేహం ఏర్పడుతోంది. అభిజిత్ అమెరికాలో చదువు, కోర్సు, సహచరులు, విశ్వవిద్యాలయం గురించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదు. ప్రశ్నలు వచ్చినప్పుడు "సమయం వచ్చినప్పుడు చెబుతాను" అని దాటవేస్తున్నారు. జార్ఖండ్ ఉద్యమానికి మద్దతు ఇవ్వలేనని జ్వరం కారణంగా చెప్పిన మరుసటి రోజే మహారాష్ట్రలో సమావేశం నిర్వహించి కోక్ తాగిన వివరాలు కూడా అసమతుల్యతను చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల మూలం ఏమిటి, కుటుంబ ఆదాయంతో ఇంతటి జీవనశైలి ఎలా సాధ్యమవుతుంది అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి. ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా 26 రోజుల పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆమె వయసు 29, గత 15 ఏళ్లుగా ఇంటికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. అంటే కౌమార దశ నుంచే వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా ఉన్నట్లు అర్థం. అయితే చదువు, ఫీజులు, నిర్వహణ ఖర్చులు ఎవరు భరిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న విషయాల్లో స్పష్టత లేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆమె చేసిన నృత్యం, 20 నిమిషాలపాటు అనర్గళంగా మాట్లాడిన విధానం చూస్తే, దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శారీరక స్థితికి సరిపోని ఉత్సాహం కనిపించింది. ఇలాంటి వైరుధ్యాలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి. సౌరభ్ దాస్ ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నివసిస్తున్నారు. నెలకు పది లక్షల రూపాయల అద్దె ఉన్న ఇంట్లో ఉంటున్నారు. దీనిని ఆయన తిరస్కరించడం లేదు. ఇల్లు ఆయన పేరిట లేకపోయినా, ముగ్గురు ఉద్యోగులు, కారు సౌకర్యాలతో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఉద్యమ కార్యకర్తగా ఇంతటి జీవనస్థాయి ఎలా సాధ్యమవుతుంది అన్నది మరో ముఖ్య ప్రశ్న. సీజేపీ రిజిస్టర్డ్ బాడీ కాదు. ఆర్ఎస్ఎస్‌ను రిజిస్టర్ చేయాలని కోరే వారు సీజేపీ విషయంలో అదే ప్రమాణాన్ని వర్తింపజేయకపోవడం గమనార్హం. ఉద్యమాలకు, సమావేశాలకు, ప్రయాణాలకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, నాయకులు ఎలా మనుగడ సాగిస్తున్నారు అన్న విషయాల్లో పారదర్శకత లేకపోవడం



# మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్

మహబూబ్ నగర్, జనసమయం;

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ప్రతిష్ఠాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి పరిధిలో 416.18 ఎకరాల భూమిని గుర్తించి సర్వేలు నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చర్చల తర్వాత ఈ ప్రాజెక్టుపై ముందడుగు పడింది. ఈ యూనిట్ ద్వారా స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో రక్షణ రంగానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ఈ యూనిట్ కోసం 416.18 ఎకరాల భూమిని అధికారులు గుర్తించి, క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల సర్వే విజయవంతంగా పూర్తికాగా.. ప్రస్తుతం పట్టా భూముల పరిశీలన కొనసాగుతోంది. రాష్ట్రంలో రక్షణ రంగ తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా ఇది అత్యంత కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు.గత ఏడాది జూలైలో డీఆర్‌డీవో అధికారులు మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి భౌగోళిక పరిస్థితులను పరిశీలించారు. రవాణా సదుపాయాలు, రోడ్డు, రైలు మార్గాలు అనుకూలంగా ఉండటంతో పాలమూరు ప్రాంతం బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు సరిగ్గా సరిపోతుందని భావించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమై ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించడంతో రాష్ట్ర యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి భూసేకరణ ప్రక్రియను ముమ్మరం చేసింది.దేవరకద్ర మండలంలోని జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి గ్రామాల్లో 416.18 ఎకరాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. చౌదర్‌పల్లిలో సర్వే నంబర్లు 295, 296 సహా బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల్లో పట్టా భూముల వివరాలను సేకరించారు. సర్వేకు ముందే గ్రామ పంచాయతీల ద్వారా రైతులకు సమాచారం అందించి వారి సమ్మతితోనే పరిశీలనలు జరుపుతున్నారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రైతులకు ఆమోదయోగ్యమైన నష్టపరిహారాన్ని నిర్ణయించనున్నారు. పాలమూరులో బ్రహ్మోస్ తయారీ కేంద్రం ఏర్పాటైతే ఈ ప్రాంత ఆర్థిక రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రధాన యూనిట్‌తో పాటు అనుబంధ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, లాజిస్టిక్స్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, నాణ్యతా ప్రమాదాల విభాగాల్లో సాంకేతిక నిపుణులతో పాటు అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల్లో స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.



# సప్తధార.. భారత్ అభివృద్ధికి మోదీ మాస్టర్‌ప్లాన్ ఇదే

న్యూఢిల్లీ, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ భవిష్యత్ అభివృద్ధికి కీలకమైన ఏడు రంగాలను 'శక్తి సప్తధార'గా అభివర్ణించారు. దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడంతో పాటు అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ఈ ఏడు శక్తులను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ.. తయారీ రంగం, రైతులు, సాంకేతికత, గతిశక్తి, రక్షణశక్తి, హరిత ఇంధనం, సాఫ్ట్ పవర్‌ను భారత్ బలాలుగా పేర్కొన్నారు. ఈ రంగాల్లో వేగంగా ముందుకు సాగితే దేశ వృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని చెప్పారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త నినాదాన్ని అందించారు. సప్తధార శక్తి పేరుతో ఆయా రంగాలకు, వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రకటించారు. ముఖ్యంగా యువతరానికి ఇచ్చే ప్రయార్టీని మోదీ పదే పదే హైలైట్ చేశారు. జెన్‌జీ ఉద్యమాల నేపథ్యంలో వారి విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే తన సంకల్పాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే సంకల్పం, దేశ ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ సంకల్పం ప్రపంచం భారతదేశాన్ని భిన్నంగా చూసేలా చేసిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ రోజు భారత్ ఒక గొప్ప కలను కంటోంది. కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని పూర్తి సంకల్పంతో కలలు కంటోంది. ఆ కల ఏమిటంటే, 2047లో భారతదేశం తన స్వాతంత్ర్యానికి 100 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు, మనం కచ్చితంగా 'అభివృద్ధి చెందిన భారత్‌ను ' నిర్మించి,



దానిని సాకారం చేస్తాం. 140 కోట్ల మంది పౌరుల కృషి, ప్రయత్నాల ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలని సంకల్పించినప్పుడు, అది యావత్ ప్రపంచం ముందు భారత్ ధైర్యానికి నిదర్శనంగా నిలుస్తుందని, భారత్‌పై ప్రపంచ దృక్పథాన్ని మార్చుకునేలా చేస్తుందని ప్రధానమంత్రి అన్నారు. భారత్ కలలు, సంకల్పం గొప్పగా ఉండాలని, ఎందుకంటే గొప్ప లక్ష్యాలు దేశ సామర్థ్యాలను కొత్త శిఖరాలకు చేర్చడంలో సహాయపడతాయని ప్రధాని మోదీ అన్నారు. "మన కలలు, సంకల్పం గొప్పగా ఉండాలి, ఎందుకంటే అవి మన సామర్థ్యాలను కొత్త శిఖరాలకు చేర్చడంలో సహాయపడతాయి" అని ఆయన అన్నారు. 12 ఏళ్లలో దేశంలో జరిగిన మార్పులను, వివిధ రంగాల్లో పెరిగిన ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ కాలంలో రక్షణ రంగ ఉత్పత్తి దాదాపు నాలుగు రెట్లు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ దాదాపు ఏడు రెట్లు, ఆధునిక రైల్వే కోచ్‌ల ఉత్పత్తి 21 రెట్లు, మొబైల్ ఫోన్ల తయారీ 33 రెట్లు పెరిగాయని తెలిపారు.

# మా సంక్షేమ ఆలోచనలో మానవీయత వుంది.. ప్రతి పథకంలో శాస్త్రీయ దృక్పథం ఉంది


సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,జనసమయం;80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిరు గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి సందేశాన్నిచ్చారు. దేశ స్వాతంత్ర్య కోసం త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకున్నారు. దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారుముఖ్యమంత్రి మాట్లాడుతూ గడిచిన రెండున్నరేండ్ల ప్రజా పాలనలో తెలంగాణ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేశాం. భవిష్యత్తు తెలంగాణ నిర్మాణాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తాం. ఈ రెండున్నరేండ్లలో ప్రజా ప్రభుత్వం సాధించిన ప్రతి విజయంలో ప్రజలు, ఉద్యోగుల భాగస్వామ్యం ఉంది. ఇక ముందు కూడా భగవంతుడి ఆశీస్సులు, మీ అందరి సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం. తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుదాం" అని పిలుపునిచ్చారు. నిరుపేదల ఆర్థిక పురోగతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఒక స్పష్టమైన దార్శనికతతో విధ్వంసమైన తెలంగాణను పకడ్బంధీ ప్రణాళికలతో వికాసంవైపు నడిపించడానికి తీసుకున్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి తన సందేశంలో సమగ్రంగా వివరించారు. "గడిచిన 32 నెలల్లో ప్రజా ప్రభుత్వం సంక్షేమంతో నాలుగు కోట్ల ప్రజలకు భరోసా ఇచ్చింది. అన్ని రంగాల్లో అభివృద్ధిని వేగవంతం చేసింది. సామాజిక న్యాయంలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించింది. భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతికత, నైపుణ్యాలపై బలమైన పునాదులు వేసింది. సాధించిన విజయాల పునాదిపై తెలంగాణను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లే బృహత్తర సంకల్పమే తెలంగాణ రైజింగ్-2047. ఈ 32 నెలల కృషి ఇప్పుడు ఫలితాల్లో కనిపిస్తోంది. ఆర్బీఐ తాజా గణాంకాల ప్రకారం 2025-26లో మన రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం దాదాపు 91 శాతం అధికంగా ఉంది. మన ఆర్థిక వ్యవస్థ బలాన్ని చాటిచెప్పే గొప్ప విజయం ఇదని అన్నారు. మా ప్రభుత్వంలో సంక్షేమాన్ని ఆర్థిక కోణంలోనో, ఖర్చు పెట్టిన రూపాయలతోనో లెక్క కట్టడం లేదు. మా సంక్షేమ ఆలోచనలో మానవీయత ఉంది. పేదవాడి పట్ల బాధ్యత ఉంది. వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న తపన ఉంది. వారికి ఆరోగ్యవంతమైన జీవితాలను అందించే ప్రయత్నం ఉంది. ఆత్మగౌరవంతో కూడిన జీవన విధానాన్ని అందించే సంకల్పం ఉంది. ప్రతి పథకంలో శాస్త్రీయ దృక్పథం ఉంది. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అని మా ప్రభుత్వం గట్టిగా నమ్ముతుంది. రైతుల కష్టాలు తీర్చి

వ్యవసాయాన్ని పండగ చేయాలనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చింది. వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో మన తెలంగాణ పంజాబ్ను దాటేసింది. దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా సాధించే విషయంలో రాజీపడేది లేదు. అటు తుమ్మడిహెట్టి నుంచి ఇటు పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు.

# రాజ్యసభలో ఖర్గే ఆవేదన, ఆగ్రహం.. "నన్ను అంటరానివాడిగా చూస్తున్నారా?"



న్యూఢిల్లీ: రాజ్యసభలో ఆవేదన, ఆగ్రహం కలగలిసిన దృశ్యం కనిపించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్ హల్ద్వానీ ఘటనను ప్రస్తావిస్తూ తీవ్రంగా చలించిపోయారు."ఇది నాకు జరిగిన అవమానం కాదు, ఈ దేశ రాజ్యాంగానికి జరిగిన అవమానం" అంటూ ఖర్గే గొంతులో బాధ, కోపం కలగలిసిపోయాయి.ఆగస్టు 8న హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో తాను ప్రసంగించిన వేదికను తాను వెళ్లిన వెంటనే కొందరు దుండగులు గంగాజలంతో "శుద్ధి" చేశారన్న వార్తలను ఆయన సభ ముందు ఉంచారు. "నా ప్రసంగం తర్వాత వేదికను శుద్ధి చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? నేను అంటరానివాడినా? నా నీడ పడితే మైల పడుతుందా?" అని ఖర్గే ప్రశ్నించిన తీరు సభను ఒక్కసారిగా నిశ్శబ్దంలోకి నెట్టింది."80 ఏళ్లు దాటిన నాకు, ఈ దేశ ప్రతిపక్ష నేతగా ఉన్న నాకే ఈ పరిస్థితి ఎదురైతే, ఈ దేశంలో కోట్లాది మంది సామాన్య దళితుల పరిస్థితి ఏమిటి? స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా ఇంకా మనం మనుషులను కులం పేరుతో అపవిత్రంగా చూస్తామా? ఇది ఎంతటి సిగ్గుచేటు!" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇది కేవలం తన వ్యక్తిగత అవమానం కాదని, ఈ దేశంలో ఇంకా బతికే ఉన్న కుల అహంకారానికి, మనువాద వివక్షకు పరాకాష్ట అని ఆయన మండిపడ్డారు.ఈ ఘటనపై సభలో తీవ్ర వాగ్వాదం చెలరేగింది. కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ, బీజేపీ ఇటువంటి నీచమైన చర్యలను ఎన్నటికీ సమర్థించదని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటించారు. వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. రాజ్యసభ ఛైర్మన్ కూడా ఈ చర్యను ఖండించారు, ఇది ప్రజాస్వామ్యానికి, మానవత్వానికి మచ్చ అని వ్యాఖ్యానిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కాంగ్రెస్ వర్గాలు అంటున్నట్లు ఇది ఒక రాజకీయ వివాదం కాదు, మన ఆత్మను ప్రశ్నించుకోవాల్సిన సమయం. రాజ్యాంగం అందరికీ సమానత్వాన్ని ఇచ్చిన దేశంలో, ఒక దళిత నాయకుడు కూర్చున్న కుర్చీని, నిలబడిన వేదికను శుద్ధి చేసే దుర్మార్గపు ఆలోచన ఇంకా ఎలా బతికి ఉంది?రాజకీయాల్లో విభేదాలు ఉండొచ్చు, విమర్శలు ఉండొచ్చు. కానీ ఒక మనిషి పుట్టుకను, సామాజిక నేపథ్యాన్ని అవమానించడం ప్రజాస్వామ్య విలువలపై దాడి చేయడమే.ప్రభుత్వం ఇప్పుడు విచారణకు హామీ ఇచ్చింది. నిజానిజాలు తేలాల్సి ఉంది. కానీ ఖర్గే సభలో లేవనెత్తిన ప్రశ్న మాత్రం ప్రతి భారతీయుడిని వెంటాడుతోంది – రాజ్యాంగం సమానత్వం ఇచ్చినా, మన మనసుల్లోని అంటరానితనపు మైల ఎప్పుడు వదులుతుంది.

# ఏపీ, తెలంగాణల్లో కోటి 10 లక్షల ఓట్ల గల్లంతు

తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. దశాబ్ద కాలంగా పేరుకుపోయిన నకిలీ ఓట్లు, డబుల్ ఓట్లు, నివాసాలు మారిన వారి వివరాలు, మరణించిన వారి పేర్లను తొలగించి ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా ఈ భారీ ఎన్యూమరేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి నిర్వహించిన సర్వేలో బయటపడిన గణాంకాలు, ముసాయిదా జాబితా ఆధారంగా రెండు రాష్ట్రాల్లోనూ ఏకంగా కోటి పది లక్షలకు పైగా ఓట్లు ప్రతిపాదిత్ తొలగింపు జాబితాలోకి చేరడం తీవ్ర రాజకీయ చర్చకు దారితీసింది. తెలంగాణలోని 3.38 కోట్ల మంది ఓటర్ల జాబితా ఆధారంగా సాగిన ఈ ప్రక్రియలో అత్యంత విస్మయపరిచే విషయాలు వెలుగుచూశాయి. ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి లభించని అన్‌కలెక్టబుల్ వర్గం కింద ఏకంగా 73,47,053 ఓట్లు మొత్తం ఓటర్లలో 21.72% నమోదయ్యాయి. శాశ్వతంగా నివాసాలు మారిన వారు 45,21,608 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో 13.37% – అన్‌కలెక్టబుల్ జాబితాలో ఏకంగా 61.5% వీరే ఉన్నారు. చిరునామా లభించనివారు 11,30,166 మంది , మరణించిన ఓటర్లు 9,22,074 మంది ఉన్నారు. డబుల్ , ఇతర చోట్ల నమోదైన ఓట్లు 6,69,649 మంది ఉన్నారు. ఈ ప్రక్రియతో తెలంగాణ ముసాయిదా ఓటర్ల సంఖ్య 3.38 కోట్ల నుంచి ఒక్కసారిగా 2.65 కోట్లకు పడిపోనుంది. ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 41.12%, మేడ్చల్–మల్కాజిగిరిలో 36.04%, రంగారెడ్డి జిల్లాలో 34.78% ఓట్లు అన్‌కలెక్టబుల్ కేటగిరీలోకి రావడం కీలకంగా మారింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ తనిఖీల్లో దాదాపు 44,71,523 ఓట్లను తొలగింపునకు అర్హమైనవిగా ఈసీ గుర్తించి రద్దు జాబితాలో చేర్చింది. ఏపీలో గతంలో జరిగిన స్థానిక సంస్థల, సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల అక్రమాలు జరిగాయని ప్రధాన రాజకీయ పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకున్నాయి. ఈ క్రమంలో ఇంత భారీగా ఓట్ల తొలగింపు చేపట్టడం ఆసక్తికరంగా మారింది. ఇందులో ప్రధానంగా నివాసాలు మారినా రికార్డుల్లో కొనసాగుతున్న వారు, సరైన లింకేజీ లేదా మ్యాపింగ్ లేని వారు , నకిలీ ప్రాతిపదికన ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న డబుల్ ఓట్లు, మరణించిన వారి స్థానాల్లో చెల్లుబాటులో ఉన్న ఓట్లను అధికారులు గుర్తించి తొలగింపు చర్యలు చేపట్టారు. రెండు రాష్ట్రాల్లోనూ పెద్ద ఎత్తున ఓటర్లకు ఎదురైన మరో పెద్ద సవాలు నో మ్యాపింగ్ . 2002 నాటి ఎస్ఐఆర్ రికార్డులతో ప్రస్తుతం సమర్పించిన వివరాలు సరిపోలకపోవడం లేదా మునుపటి ఓటరు ఐడీ వివరాలు ఆన్‌లైన్‌లో లభించకపోవడాన్ని నో మ్యాపింగ్ గా గుర్తించారు. తెలంగాణలో సుమారు 30% మంది ఓటర్లు ఈసీ ఆంక్షల పరిధిలోకి , ఈఆర్ఓల నోటీసుల పరిధిలోకి వచ్చారు. ఆధార్ లేదా రేషన్ కార్డులను పౌరసత్వ నిరూపణ పత్రాలుగా పరిగణించకపోవడం, ఇతర 11 గుర్తింపు పత్రాలనే అడగడం అర్బన్ , గ్రామీణ ఓటర్లకు కొంత ఇబ్బందికరంగా మారింది. ఈ స్థాయి ప్రక్షాళన రాబోయే మున్సిపల్, స్థానిక సంస్థల మరియు సార్వత్రిక ఎన్నికల ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్ వంటి నగరాల్లో వలస ఓటర్లు, ఐటీ వర్కింగ్ క్లాస్ ఓట్లు పెద్ద ఎత్తున డిలీట్ కావడం క్షేత్రస్థాయి సమీకరణాలను మార్చివేస్తుంది. నివాసాలు మారి రెండు ప్రాంతాల్లోనూ ఓటు హక్కు పొందుతున్న వారి సంఖ్య తగ్గడం వల్ల బోగస్ ఓటింగ్‌కు గండి పడుతుందని అంచనా వేస్తున్నప్పటికీ, నిజమైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగించబడితే అది అధికార, ప్రతిపక్ష పార్టీలకు రాజకీయంగా మింగుడుపడని అంశంగా మారవచ్చు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు తొలిగిపోయినప్పటికీ, ఇది పూర్తిస్థాయి ముగింపు కాదని ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# 42 కాదు, 50 శాతం బీసీ రిజర్వేషన్లు అడుగుదాం

## తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




హైదరాబాద్,జనసమయం;


సమాజంలో వనరులు అందరికీ సమానంగా అందాలనేదే మనందరి ఆలోచన కావాలి. సామాజిక న్యాయంపై అగ్రవర్ణ మిత్రులు కూడా ఒక్కసారి పునరాలోచించాలిని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.

గురువారం జరిగిన సామాజిక తెలంగాణ న్యాయ సభలో అమె మాట్లాడారు. దేశం మొత్తంలో 50% బీసీలం. 42 కాదు, 50 శాతం రిజర్వేషన్లు అడుగుదాం. ఇక్కడి నుంచి ఢిల్లీ దాకా కొట్లాడుదాం. బీజేపీకి, కాంగ్రెస్ కి ఇవాళ ఇక్కడి నుంచి హెచ్చరిక ఇస్తా ఉన్నాం .

వచ్చే బడ్జెట్ సెషన్ లోపల బీసీ బిల్లు పాస్ చేసి పంపండి. లేకపోతే తెలంగాణ టీఆర్ఎస్ సైన్యమంతా ఢిల్లీకి బయలుదేరుతదిని అన్నారు.తమిళనాడులో తన రాజకీయ చతురతను ప్రదర్శించి బీసీలకు ఉండే రిజర్వేషన్ని శాశ్వతంగా వారిని కాపాడటం కోసం నైన్త్ షెడ్యూల్లో పెట్టిచ్చిన విప్లవ వనిత జయలలిత... ఆమె అగ్రవర్ణ బ్రాహ్మణ స్త్రీ... ఆమెను ఆదర్శంగా తీసుకొని ఇవాళ అగ్రవర్ణ మహిళలందరూ కూడా కదలి రావాలే ఈ ఉద్యమంలో కలిసి రావాలే తెలంగాణలో సామాజిక న్యాయం సాధించి తీరాలని అన్నారు.

ఎస్టీలకు రిజర్వేషన్లు ఉన్నాయంటే వెనుకబాటుతనం పోయినట్టేనా? 99% ఎస్టీలు ఇంకా అత్యంత వెనుకబాటులోనే ఉన్నారు, ఆ వెనుకబాటుతనాన్ని నిర్మూలిస్తామని ఇవాళ ప్రతిజ్ఞ చేద్దామని పిలుపునిచ్చారు.ఎస్సీ మిత్రుల గురించి ఒకసారి ఆలోచించండి. ఇన్ని సుద్దులు చెప్పే మోడీ పరిపాలనలో లక్షలాది బ్యాక్లాగ్ ఎస్సీ, ఎస్టీ పోస్టులు పెండింగ్ ఉన్నాయి. ఈ సామాజిక న్యాయ పోరాటంలో మనం సంకల్పం తీసుకుందాం. బ్యాక్లాగ్ ఉన్న ప్రతి ఎస్సీ, ఎస్టీ పోస్టుని ఇచ్చేంతవరకు మనం పిడికిలెత్తి పోరాటం చేద్దాం. ఎస్సీ మిత్రులకు అండగా నిలబడదామని అన్నారు.అజ్మల్ కసాబ్ లాంటి ఉగ్రవాదిని అయినా, చిన్నారులపై దారుణాలకు పాల్పడిన వారినైనా, చట్టం, రాజ్యాంగం చూపిన మార్గంలోనే శిక్షిస్తుంది. అదే రాజ్యాంగం అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం చేయాలని కూడా చెబుతోంది. ఈ ధర్మ పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె అన్నారు.

# మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు




హైదరాబాద్, జనసమయం;

హైదరాబాద్ ప్రజలకు మరో సూపర్ న్యూస్. నగరంలో ప్రముఖ పార్క్‌గా ప్రసిద్ధి పొందిన కేబీఆర్ పార్క్ వద్ద రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ పార్క్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ముందడుగు వేసింది. మొత్తం 14 నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఏడు ప్రధాన కూడళ్ల వద్ద ఈ నిర్మాణాలు జరగనున్నాయి. మొన్నటివరకు కోర్టు కేసులు, భూసేకరణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరగగా.. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. దీంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రెండేళ్లల్లో పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్క్ రోడ్డు మధ్య నాలుగు లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపుకు 3 లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇక మహారాజా అగ్రసేన జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వైపు 2 లైన్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇక ఫిల్మ్ నగర్-బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 మధ్య 2 లైన్లతో కూడిన ఫ్లైఓవర్ ప్రతిపాదించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్-జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 మధ్య 2 లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక వీటితో పాటు మొత్తం 6 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 2 లైన్ల అండర్ పాస్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్ నగర్ వైపు ఒక అండర్ పాస్, ఎల్వీ ప్రసాద్ నుంచి పంజాగుట్ట వైపు 3 లైన్ల అండర్ పాస్, రోడ్డు నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వరకు ఒక అండర్ పాస్ ఉంటుంది. దాదాపు ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ. 1090 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిల్లో నిర్మాణ పనుల కోసం రూ. 699.75 కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణ ప్రక్రియ కోసం రూ. 390 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు. ఉక్కు వంతెనల నిర్మాణం వల్ల భూసేకరణ ఖర్చు తగ్గుతుందని, తక్కువ స్థలంలోనే పనులు చేపట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే కేబీఆర్ పార్క్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ తగ్గుతుంది. సిగ్నల్ ఫ్రీ జర్నీ వాహనదారులకు లభించనుంది. హైటెక్ సిటీ, ఫిల్మ్ నగర్ వె?పు వెళ్లేవారు వేగవంతంగా చేసుకోవచ్చు.

# సరళా సాగర్ ప్రాజెక్టు...



తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని చిన్నవాగు (ఊకచెట్టు వాగు)పై ఉన్న సరళా సాగర్ ప్రాజెక్టు సాధారణ ఆనకట్టలకు భిన్నమైనది. గేట్లు ఎత్తాల్సిన అవసరం లేకుండా, విద్యుత్ సహాయం లేకుండా కేవలం గాలి?నీటి పరస్పర చర్యతో ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ వ్యవస్థ ఇప్పటికీ ఇంజనీర్లను ఆశ్చర్యపరుస్తోంది. ఇది స్థానిక వనరులు, విదేశీ సాంకేతిక జ్ఞానం, భౌతిక శాస్త్ర సూత్రాల సమ్మేళనంగా నిలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని చిన్నవాగు (ఊకచెట్టు వాగు)పై ఉన్న సరళా సాగర్ ప్రాజెక్టు సాధారణ ఆనకట్టలకు భిన్నమైనది. గేట్లు ఎత్తాల్సిన అవసరం లేకుండా, విద్యుత్ సహాయం లేకుండా కేవలం గాలి?నీటి పరస్పర చర్యతో ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ వ్యవస్థ ఇప్పటికీ ఇంజనీర్లను ఆశ్చర్యపరుస్తోంది. ఇది స్థానిక వనరులు, విదేశీ సాంకేతిక జ్ఞానం, భౌతిక శాస్త్ర సూత్రాల సమ్మేళనంగా నిలుస్తుంది. 1940 చివరలో వనపర్తి సంస్థానాధీశులు రాజా రామేశ్వరరావు ఈ ప్రాజెక్టును రూపొందించారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో సైఫన్ టెక్నాలజీని చూసిన తర్వాత, దానిని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనుసరించారు. తల్లి సరళాదేవి పేరు మీద ఈ ఆనకట్టకు పేరు పెట్టారు. 1949లో పునాదులు వేయబడి 1959లో పూర్తయిన ఈ ప్రాజెక్టు స్వాతంత్ర్యానంతర కాలంలోనే సాగునీటి రంగంలో కొత్త మార్గం చూపింది. ఇది కేవలం నీటి నిల్వ కాకుండా, మానవ ప్రమేయం లేని ఆటోమేటిక్ వ్యవస్థగా రూపొందింది. సాధారణ ఆనకట్టల్లో గేట్లు తెరిచి మూయాల్సి వస్తుంది. కానీ ఇక్కడ క్యూ ఆకారంలోని గొట్టాలు (సైఫన్లు) అమర్చబడ్డాయి. ఇవి ఫిజిక్స్‌లోని వాక్యూమ్ సూత్రం మీద ఆధారపడి పనిచేస్తాయి. డ్యాంలో నీటి మట్టం నిర్ణీత స్థాయిని దాటగానే గొట్టాల్లోకి నీరు చేరుతుంది. మరింత పెరిగితే గాలి పూర్తిగా బయటకు వెళ్లి శూన్యత ఏర్పడుతుంది. ఆ ప్రెజర్ తేడా వల్ల నీరు వేగంగా కిందకు లాగబడి నదిలోకి ప్రవహిస్తుంది. నీటి మట్టం తగ్గగానే గాలి తిరిగి ప్రవేశించి ప్రవాహం ఆగిపోతుంది. ఇలా గేట్లు, మోటార్లు లేదా మానవ నియంత్రణ అవసరం

లేకుండా పూర్తి స్వయంచాలకంగా నడుస్తుంది. ఆసియాలో ఇలాంటి సైఫన్ వ్యవస్థ ఉన్న ప్రాజెక్టుల్లో ఇది రెండోది. చిన్న సామర్థ్యం (సుమారు 0.5 టీఎంసీ) ఉన్నప్పటికీ, వేల ఎకరాల సాగుకు మద్దతు ఇస్తూ స్థిరమైన నీటి నిర్వహణకు ఉదాహరణగా నిలుస్తోంది. సుమారు 4,500 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు స్థానిక రైతులకు జీవనాధారంగా మారింది. వర్షాధార ప్రాంతాల్లో నీటి లభ్యతను నిర్ధారించడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచింది. ఇలాంటి సహజ ఆధారిత పరిష్కారాలు నేటి కాలంలో మరింత అవసరం. వాతావరణ మార్పులు, విద్యుత్ కొరత, నిర్వహణ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో సరళా సాగర్ లాంటి మోడళ్లు స్ఫూర్తినిస్తాయి. ఈ వ్యవస్థ గురుత్వాకర్షణ, వాతావరణ పీడనం, శూన్యత వంటి ప్రాథమిక సూత్రాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. నీరు పైనుంచి కిందకు ప్రవహించే సహజ ధోరణిని నియంత్రించడం ద్వారా వరద నీటిని సురక్షితంగా విడుదల చేస్తుంది. ఇది పర్యావరణపరంగా కూడా లాభదాయకం. విద్యుత్ వినియోగం లేకపోవడం, యంత్రాల నిర్వహణ ఖర్చు తగ్గడం, దీర్ఘకాలిక మన్నిక పెరగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. ఆధునిక ఇంజనీర్లు ఈ సాంకేతికతను చూసి ఆశ్చర్యపోవడం సహజం, ఎందుకంటే ఇప్పటి అధునాతన సెన్సార్లు, కంప్యూటర్ నియంత్రణలు లేకుండానే దశాబ్దాలుగా నమ్మకంగా పనిచేస్తోంది. సరళా సాగర్ కేవలం ఒక ఆనకట్ట కాదు. ఇది మానవ ఆలోచన, ప్రకృతి శక్తుల సమన్వయానికి ప్రతీక. విదేశీ సాంకేతికతను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చి, దీర్ఘకాలం నిలిచే వ్యవస్థను సృష్టించడం దీని గొప్పతనం. ఆధునిక ప్రాజెక్టులు సంక్లిష్ట యంత్రాలపై ఆధారపడుతున్నప్పుడు, ఇలాంటి సాధారణమైన కానీ సమర్థవంతమైన పరిష్కారాలను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉంది.

# వందల కోట్ల విలువైన భూములు ఎలా దక్కించుకోవాలో నేర్పించండి:


## --కేటీఆర్ సెటైరికల్ పోస్ట్

హైదరాబాద్ జనసమయం;

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టీ హబ్బును నిర్మిస్తే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ-రన్: ఫ్యామిలీ-డ్రైవ్ జీరో ఇన్నోవేషన్ జీరో ఎంప్లాయీస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ. 200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం.. వయా పాకిస్థాన్..!

న్యూఢిల్లీ, రష్యా నుంచి భారత్‌కు రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆ దేశ ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ప్రతిపాదించారు. ఈ మార్గం తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా సాగి హిందూ మహాసముద్రానికి చేరుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో అనుసంధానమయ్యే ఏ మార్గమైనా పరిశీలించేందుకు అనుకూలమేనని స్పష్టం చేశారు. బోస్ఫరస్, హర్మూజ్ జలసంధుల వద్ద ఎదురయ్యే భద్రతా, వాణిజ్యపరమైన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ భూభాగ మార్గాల అవసరం పెరుగుతోందని రష్యా భావిస్తోంది. రష్యా నుంచి భారత్‌కు రైలులో సరుకు రవాణా చేసే మార్గం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని కీలక సముద్ర వాణిజ్య మార్గాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో.. సముద్ర మార్గాలకు ప్రత్యామ్నాయంగా భారీ రైల్వే కారిడార్‌ను అభివృద్ధి చేసే అవకాశాన్ని రష్యా పరిశీలిస్తోంది. రష్యా ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ఈ ప్రతిపాదనను ప్రస్తావించారు. రష్యా నుంచి హిందూ మహాసముద్రం వరకు రైల్వే లింక్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆయన సూచించారు. తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా ఈ రైల్వే మార్గాన్ని తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్‌కు చేరుకునే అవకాశం కల్పించే ఏ రూట్ అయినా తమకు పరిశీలనీయమేనని పేర్కొన్నారు. బోస్ఫరస్, హోర్ముజ్ జలసంధులపై ఆధారపడే అంతర్జాతీయ వాణిజ్య మార్గాలకు భద్రతాపరమైన ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో రష్యా ఈ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు నాలుగో వంతు, ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాల్లో దాదాపు ఐదో వంతు ఈ ప్రాంతం



గుండా సాగుతుందని అంచనా. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇటీవలి కాలంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు పెరగడంతో హర్మూజ్ జలసంధి ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో సముద్ర మార్గాల్లో అంతరాయాలు ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు అవసరమని రష్యా భావిస్తోంది. రష్యా ప్రతిపాదనల ప్రకారం సాధ్యమైన రైల్వే కారిడార్ తుర్క్‌మెనిస్తాన్ నుంచి ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా హిందూ మహాసముద్రంకు చేరేలా ఉండనుంది. ఈ మార్గం పూర్తిగా అమలులోకి వస్తే రష్యాకు సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని కొంత మేర తగ్గించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా భారత్‌తో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ తరహా భూభాగ రవాణా మార్గం ఉపయోగపడే అవకాశం ఉందని రష్యా భావిస్తోంది.

# మిల్లర్ల గోడువినేది ఎవరు ?

## బియ్యం రాక మిల్లర్ల నరకయాతన.ధాన్యం కొనుగోలు మిల్లర్లు చేస్తేనే మేలు.

హన్మకొండ జనసమయం;.ప్రభుత్వం నిర్దేశించిన బియ్యం దిగుబడి రాక మిల్లర్లు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మిల్లర్ల మెడపై కత్తి పెట్టి ధాన్యం దిగిమతి చేయిస్తుందన్నారు. ఎవరో కొంతమంది మిల్లర్లు చేసిన పొరపాటు వలన జిల్లాలోని మిల్లర్లు అందరిపై ఆర్థిక భారం పడుతుందని దాని వలన ఆయా కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయని కొంతమంది మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం మిల్లర్ల వద్ద నుండి బ్యాంకు డిపాజిట్ పేరుతో లక్షల రూపాయలని ముందస్తుగా వసూలు చేస్తుందన్నారు. బ్యాంకులలో డిపాజిట్ చేసిన మిల్లర్లకే ప్రభుత్వం ధాన్యం దిగుమతికి అవకాశం ఇస్తుందని వారు వాపోతున్నారు. ఇటీవల హన్మకొండ జిల్లాలోని శాయంపేట మండలంలోని  రైస్ మిల్ పై సంబంధిత అధికారులు దాడి చేసి ధాన్యం లోటును గుర్తించారు. ఆ క్రమంలో ఆ మిల్లుల నిర్వహకులను ఇటీవల జైలుకు పంపిన విషయం తెలిసింది. 2024 , 2025 , 2026 సంవత్సరానికి గాను ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. దీంతో ఆ  మిల్లులు ప్రభుత్వం ఐకెపి ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని దిగుమతి దిగుమతి చేసుకున్నాయి. వర్షాకాలంలో దిగుమతి చేసుకున్న వారి ధాన్యం నాణ్యత పరంగా బాగుంటుందని మిల్లర్లు అంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి క్వింటల్ ధాన్యానికి 68 కిలోల బియ్యం రావడం కష్టమని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి మిల్లరు ఆ లోటును పూడ్చడానికి తీవ్రంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలు ఉన్నాయని అంటున్నారు. ఒక్కోసారి ఆ లోటును పూడ్చలేక ఇల్లు భూములు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని మిల్లర్లో అంటున్నారు. ఎంత ఎక్కువగా ధాన్యాన్ని దిగిన చేసుకుంటే అంత ఎక్కువగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని వారు తెలిపారు. ధాన్యాన్ని పట్టే సమయంలో వచ్చే తౌడు , ఉను క ,నూకలు , పరం లాంటి వస్తువులను బయట అమ్మి లోటును పూడ్చవలసిన దుస్థితి ఏర్పడుతుందని మిల్లర్లు అంటున్నారు. ధాన్యాన్ని పట్టే క్రమంలో విద్యుత్ చార్జీ మిల్లులో పనిచేసే కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఉంటున్నాయని మిల్లర్లు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న కమిషన్ సకాలంలో మిల్లర్లకు అందించినట్లయితే నెత్తిపై పడే భారాన్ని కాసింత తగ్గించుకోవచ్చని మిల్లర్లు తెలిపారు.ధాన్యం కొనే అవకాశం మిల్లులకే ఇవ్వాలి.  రైతులు పండించిన పరిధాన్యాన్ని కకొనుగోలు చేసే అవకాశం మిల్లులకు ఇవ్వాలని మిల్లర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దానివలన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని మిల్లర్లు తెలిపారు. కనీస మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం మిల్లర్లు వచ్చే కొనే అవకాశం ఇచ్చినట్లయితే నష్టం తాలూకు భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఐకేపీ ద్వారా కొనే విధానం వలన కొన్ని సెంటర్లలో రాజకీయ ప్రమేయాలు చోటుచేసుకుని నాణ్యమైన ధాన్యం దిగుమతి కాకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే నాణ్యమైన ధాన్యాన్ని రైతులు మిల్లర్ల వద్దకు తేవడం లేదని పేర్కొన్నారు. రైతుల పండించిన ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారం కొనుగోలు చేయకపోయినా వాటి అనుమతులను రద్దు చేయాలని

కొంతమంది మిల్లర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నారు. రైతులు ధాన్యం పూర్తిగా ఎండకు ముందే మిల్లర్లకు తేవడం వల్ల వాటిలో దిగుమతి రావడం లేదని పేర్కొన్నారు. డిపాజిట్ రూపంలో అదనపు భారం. ధాన్యం దిగుమతి చేసుకోవాలంటే ప్రతి మిల్లర్ విధిగా బ్యాంకులో డిపాజిట్ చేయాలన్న నిబంధన మిల్లర్ల పాలిట గుదిబండగా మారింది అంటున్నారు. దిగుమతి చేసుకున్న ధాన్యములో 10% బ్యాంకులో డిపాజిట్ చేస్తేనే ప్రభుత్వం అనుమతినిస్తుందని వారు తెలిపారు. మిల్లుల నిర్వహణ గతంతో పోలిస్తే కష్టసాధ్యంగా మారిందని యజమానులు ఆపోతున్నారు. రైతులకు నష్టం జరగకుండా మిల్లు యజమానులకు నష్టాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంటుందని కొంతమంది మిల్లర్లు అంటున్నారు.

# కక్ష సాధింపు చర్యలతో సిద్దిపేట అభివృద్ధిని కుంటుపరిచారు

## --మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట (జనసమయం) హరీష్ రావు మాట్లాడుతూ అభివృద్ధి ఆగిపోయింది వ్యాపారాలు పడిపోయాయి మళ్లీ మన ప్రభుత్వం రాగానే రెట్టింపు వేగంతో అభివృద్ధి చేసి తీరుతాఆరోగ్యం పట్ల డ్రైవర్లు జాగ్రత్త వహించాలి యోగా, వాకింగ్ చేయాలి.లైట్ మోటార్ వెహికల్స్ అసోసియేషన్ సభ్యులకు మాజీ మంత్రి హరీశ్ రావు సూచన. సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టిందని, గతంలో పరుగులు పెట్టిన అభివృద్ధి నేడు కుంటుపడిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లైట్ మోటార్ వెహికల్స్ అసోసియేషన్ సభ్యులకు ఆయన ఇన్సూరెన్స్ బాండ్లు పంపిణీ చేశారు. డ్రైవర్లు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలని, ఏదైనా ప్రమాదం జరిగినా వారి కుటుంబాలు రోడ్డున పడకుండా అండగా నిలవాలనే ఉద్దేశంతో ఎల్ఎంవి సభ్యులందరికీ జీవిత బీమా చేయించినట్లు తెలిపారు. ఈ ఇన్సూరెన్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తానని, భవిష్యత్తులోనూ తానే స్వయంగా ఈ బాధ్యత తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిద్దిపేట చిన్నబోయింది. రియల్ ఎస్టేట్ పడిపోయింది, వ్యాపారాలు తగ్గిపోయాయి. ఎక్కడ చూసినా టూలెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.గతంలో కార్లు, డీసీఎంలకు నెలకు 15 గిరాకీలు వస్తే, ఇప్పుడు కనీసం ఆరేడు కూడా దొరకడం కష్టంగా మారింది. అందరి జీవితాలు ఆర్థికంగా కింద మీద అయ్యాయి.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడైనా రోడ్డుపై



ఒక్క గుంత అయినా కనిపించిందా కానీ ఇప్పుడు ఏ రోడ్డు చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి.పాత బస్ స్టాండ్ ను చూస్తుండగానే అద్భుతంగా ఆధునికీకరించి పూర్తి చేశాం. కానీ నేడు 1000 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీ, శిల్పారామం, రైల్వే బ్రిడ్జి, టూరిజం ప్రాజెక్టు పనులు మూడేళ్లుగా ఎక్కడికక్కడే ఆగిపోయి మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి.సిద్దిపేటలో అన్ని రకాల చదువులు ఉండాలనే సంకల్పంతో ఎంబీబీఎస్, అగ్రికల్చర్, వెటర్నరీ కాలేజీలు తీసుకొచ్చాం. కానీ కలెక్టరేట్ వద్ద సగం నిర్మించిన వెటర్నరీ కాలేజీని ఈ ప్రభుత్వం కొడంగల్ కు ఎత్తుకుపోయింది. కొత్తవి పెట్టుకోవచ్చు కానీ, సిద్దిపేటలో కడుతున్న కాలేజీని తరలించుకుపోవడం దొంగల పని కాదా.ఈ దొంగ చర్యలను నేను చూస్తూ ఊరుకోను మళ్లీ మన ప్రభుత్వం రాగానే ఈ పనులన్నింటినీ రెట్టింపు వేగంతో పరుగులు పెట్టిస్తా.

# ఒంటరిగా బరిలోకి జనసేన

హైదరాబాద్, జనసమయం; తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. : తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. దీంతో సొంతంగానే పోటీకి సిద్ధమవుతోంది జనసేన తెలంగాణలో. త్వరలో జరిగే గ్రేటర్ ఎన్నికలతో పాటు ప్రభావం చూపించగలిగిన జిల్లాల్లో ప్రాదేశిక ఎన్నికల్లో సైతం పోటీ చేయాలని చూస్తోంది జనసేన. అయితే ఉన్నట్టుండి బిజెపి జనసేన విషయంలో ఆ ఆలోచన చేయడానికి కారణం ఏంటనే ప్రశ్న వినిపిస్తోంది. భారత రాష్ట్ర సమితి తో బిజెపి పొత్తు ఉంటుందన్న పరిణామ క్రమంలోనే జనసేన ను దూరం పెట్టినట్లు తెలుస్తోంది. అయితే జనసేన మాత్రం ఒంటరి పోరాటానికి అన్ని ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు సమాచారం.వాస్తవానికి ఏపీ మాదిరిగా తెలంగాణలో రాజకీయాలు ఉండవు. బిజెపి ఆది నుంచి స్వంతంగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. కానీ ఆశించిన స్థాయిలో ఆ ప్రయత్నాలు ఏవి ఫలించడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం గట్టి ప్రభావం చూపింది. అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎనిమిది పార్లమెంట్ స్థానాలను తెచ్చుకుంది. అయితే బిజెపి అంతలా ప్రభావం చూపడానికి కారణం భారత రాష్ట్ర సమితి బలహీనం కావడమే. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలపడలేదు. ఆ బలాన్ని భర్తీ చేయాలంటే భారత రాష్ట్ర సమితితో పొత్తు బిజెపికి అవసరం. అదే సమయంలో పూర్వవైభవం దిశగా అడుగులు వేయాలంటే ఓట్లతో పాటు సీట్లు పెంచుకోవడం భారత రాష్ట్ర సమితికి అవసరం. అందుకే ఆ రెండు పార్టీలు ఇప్పుడు పరస్పరం ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. జనసేన ను బిజెపి దూరం పెట్టడానికి అదే ప్రధాన కారణం అని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణలో మొన్న ఆ మధ్యన జరిగిన పరిణామాలు తెలియనివి కావు. పవన్ కళ్యాణ్ ను తెలంగాణ నుంచి కొంతమంది వ్యతిరేకించడం ప్రారంభించారు. దీంతో తెలంగాణలో కార్యకలాపాలు మొదలు పెట్టింది జనసేన. హైదరాబాదులో రాష్ట్ర కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అయితే బిజెపితో పొత్తు ఉంటుందన్న తరుణంలోనే ఇలా చేస్తున్నారని అంతా భావించారు. కానీ భారతీయ జనతా పార్టీ ఆలోచన మరోలా ఉంది. అందుకే జనసేనతో పొత్తు విషయంలో క్లారిటీ ఇచ్చింది. కానీ ఏపీ అనుభవాల నేపథ్యంలో ఒంటరిగా ముందు పోటీ చేసి.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటే ఇతర పార్టీలు పొత్తుకు ముందుకు వస్తాయని.. అందుకే ఒంటరిగా ముందుకు వెళ్దామని జనసేన వర్గాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. సెటిలర్స్ అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు అభిమానులు ఉన్నచోట పార్టీని మరింత బలోపేతం చేయాలని జనసేన భావిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది.



# రెంట్ బాయ్‌ఫ్రెండ్ తో జరాభద్రం

హైదరాబాద్, జనసమయం;సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్.. సోషల్ మీడియాలో జరుగుతున్న మరో మోసంపై యువతను అప్రమత్తం చేశారు. రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో నెట్టింట జరుగుతున్న ప్రచారం వెనుక ఉన్న మోసాలను వివరిస్తూ అమ్మాయిలు, యువతులను అలర్ట్ చేశారు. ఆకర్షణీయమైన కుర్రాళ్ల ఫోటోలు పెట్టి, అమ్మాయిలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఇలాంటి కేటుగాళ్ల వలలో పడొద్దంటూ హెచ్చరించారు. ఇలాంటి మోసాలను గమనిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.సోషల్ మీడియాలో జరిగే మోసాల నుంచి సైబర్ నేరాల వరకూ ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్. ముఖ్యంగా యువతీ, యువకులు మోసాలకు గురికాకుండా సోషల్ మీడియా ద్వారావారిని అలర్ట్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే రెంట్ బాయ్‌ఫ్రెండ్ పేరుతో నెట్టింట జరుగుతున్న మోసాలపై మరోసారి యువతను అప్రమత్తం చేశారాయన. ఆగస్ట్ నెలలో రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు వల వేసేందుకు సిద్ధంగా ఉన్నారని.. అలర్ట్‌గా ఉండాలని అమ్మాయిలకు సూచించారు.ఒంటరితనంతో బాధపడుతున్నారా? మీతో కాఫీ తాగడానికి, సినిమాకెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అది కూడా 50 శాతం ఆఫర్లతో అంటూ సోషల్ మీడియాలో కలర్‌ఫుల్‌గా కనిపించే పోస్టర్ల వెనుక సైబర్ మోసం దాగి ఉందని.. అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు విసురుతున్న కొత్త డేటింగ్ ట్రాప్ ఇదంటూ సజ్జనార్ హెచ్చరించారు. ఫేస్ బుక్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లోఆకర్షణీయంగా ఉండే అబ్బాయిల ఫోటోలను చూపిస్తూ.. కాఫీ మీటింగ్, సినిమా డేట్, షాపింగ్, ఈవెంట్లు, పెళ్లిళ్లు, ఫుల్ డే ప్యాకేజీ అంటూ కేటుగాళ్లు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. గోప్యత, భద్రత పాటిస్తామని, అక్రమ వ్యాపారం కాదని నమ్మబలుకుతూ బుకింగ్స్ కోసం డైరెక్ట్ మెసేజ్ చేయాలని కోరుతూ నెట్టింట ప్రచారం చేస్తున్నారని సజ్జనార్ వివరించారు."ఏఐతో సృష్టించిన, ఇంటర్నెట్ నుంచి సేకరించిన అందమైన కుర్రాళ్ల ఫోటోలను ప్రొఫైల్ పిక్చర్లుగా పెట్టి, మెసేజ్ చేసిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో సంభాషణలు మొదలుపెడతారు. బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ అమౌంట్ పేరుతో డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలు వసూలు చేసి, ఆపై అకౌంట్లను బ్లాక్ చేస్తారు. ఆన్‌లైన్ సంభాషణలు నమ్మి అపరిచిత వ్యక్తులను నేరుగా కలవడానికి వెళ్తే వారు మిమ్మల్ని సులభంగా ట్రాప్ చేసే ప్రమాదం ఉంది. ప్రేమ పేరుతో అబద్ధాలు చెప్పి మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చాటింగ్ క్రమంలో చాకచక్యంగా సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత ఫోటోల ఆధారంగా ఆ తర్వాత బెదిరింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది." అని సజ్జనార్ యువతులు, అమ్మాయిలను అప్రమత్తం చేశారు.సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ రకమైన మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం దృష్టిసారించిందని.. వీటికి బాధ్యులైన వారిపై వేగంగా దర్యాప్తు చేసి.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో అమ్మాయిలతో పాటుగా, వారి తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. తమ పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? బయట ఎవరిని కలుస్తున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు.

# హైదరాబాద్‌లో 'నో టాలరెన్స్' జోన్లు.. ట్రాఫిక్ రద్దీకి చెక్...

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు కీలక చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారులపై ఇష్టారాజ్యంగా వాహనాలను నిలిపివేయడాన్ని అరికట్టేందుకు నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలను నో టాలరెన్స్ జోన్లుగా ప్రకటించే ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చారు. ఈ జోన్లలో రహదారులపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులు, మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా నియంత్రించడం ద్వారా నగరంలో వాహనాల రాకపోకలను వేగవంతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా అధికారులు పేర్కొంటున్నారు. పురపాలక శాఖ ఆదేశాల మేరకు బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధ్యక్షతన హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (హుమ్టా) వర్కింగ్ గ్రూప్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్, హుమ్టా ఎండీ బి. జీవన్‌బాబు, జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలోని జోనల్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నగర ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు అమలు చేయాల్సిన పలు ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా రద్దీ ప్రాంతాల్లో ఆధునిక పార్కింగ్ సదుపాయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. చార్మినార్ బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ తరహాలో నెక్లెస్ రోడ్‌తో పాటు ఇతర రద్దీ ప్రాంతాల్లో కూడా పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో మల్టీలెవల్



పార్కింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. దీంతో రహదారులపై అక్రమ పార్కింగ్ తగ్గి ట్రాఫిక్ ప్రవాహం మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. పాదచారుల భద్రతకు కూడా ప్రాధాన్యం ఇస్తూ పలు కొత్త ప్రతిపాదనలు చేశారు. ఆరాంఘర్ చౌరస్తాలో స్కైవాక్ నిర్మించడంతో పాటు బండ్లగూడ ఆరె మైసమ్మ దేవాలయం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. అత్తాపూర్ నుంచి ఆరాంఘర్ వరకు రహదారిని విస్తరించి సర్వీస్ రోడ్లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. అలాగే మెహిదీపట్నం నుంచి పంజాగుట్ట మీదుగా కూకట్‌పల్లి వరకు, మరోవైపు నానల్‌నగర్ నుంచి టోలిచౌకి వరకు రహదారి ఆక్రమణలను తొలగించి పాదచారుల కోసం నిరంతర కాలిబాటలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ట్రాఫిక్ ప్రమాదాలకు కారణమవుతున్న సమస్యాత్మక యూటర్న్‌ల వద్ద ప్రత్యేక బారికేడ్లు, డివైడర్లను ఏర్పాటు చేసి వాహనాల కదలికలను క్రమబద్ధీకరించనున్నారు. ఉప్పల్ కూడలిలో ఏర్పాటు చేసిన నమూనా తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కూడా స్కైవాక్ లేదా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించే అవకాశాలను పరిశీలిస్తున్నారు.

# భారత రాజ్యాంగము

## ఆర్టికల్ 15

ప్రవేశమునకుగాను, రిజర్వేషను విషయములో ఇప్పటికి ఉన్న రిజర్వేషన్లకు అదనంగా, ప్రతి వర్ణానికి చెందిన మొత్తము సీట్లలో గరిష్టంగా 10 శాతానికి లోబడి ఏదేని నిబంధన చేయుట నుండి ప్రభుత్వమును నివారించదు.

విశదీకరణ:--- ఈ ఆర్టికల్ మరియు ఆర్టికల్ 16 ప్రయోజనాల కొరకు "ఆర్థికముగా బలహీన వర్గాలు" అనగా కుటుంబ ఆదాయం మరియు ఆర్థిక ప్రతికూలత ఇతర సూచికల ఆధారంగా ఎప్పటికప్పుడు ప్రభుత్వముచే నోటిఫై చేయబడునటువంటివి.

[Inst. by the Const. (103rd Amdt.) Act, 2019


### ఆర్టికల్ 15 పై వాఖ్యానము

14వ ఆర్థికలు, సమానత్వ సూత్రాలను (Principle of Equality in General) గురించి, వివరించగా, 15 నుండి 18వరకు గల ఆర్టికల్స్, సమానత్వ సూత్రపు నిర్దిష్ట అంశాలను (Specific aspects of Equality Principle) గురించి వివరిస్తుంది. 15 నుండి 18 వరకు ఆర్టికల్స్, పౌరులకు మాత్రమే లభ్యమవుతాయి. మవుతాయి.

14వ ఆర్థికలు తరగతి వర్గీకరణను నిషేధించగా, 15వ ఆర్థికలు హేతుబద్ధమైన వర్గీకరణను (reasonable classification) అనుమతిస్తోంది.

15వ ఆర్టికలు, కొన్ని మినహాయింపులకు లోబడి విచక్షణ చూపడానికి అనుమతించుటలేదు. 15వ ఆర్థికలు వ్యక్తిగత హక్కులను (Rights in Personam) ప్రసాదిస్తుంది. ఈ హక్కులు కంపెనీలకు గానీ, పబ్లికు కార్పొరేషన్లకుగాని లభించవు. ఈ ఆర్థికలు ఏక పక్ష నిర్ణయాలు తీసుకోవడానికి లేదా కేవలం మతం, జాతి, కులము, లింగబేధము జన్మస్థలం, వీటిలో ఏదేని ఒక కారణము వలన ఒక పౌరునికి మరో పౌరునికి మధ్య అనుకూల

# భారత రాజ్యాంగం




విచక్షణ చూపడానికి అనుమతించదు. ఇక్కడ 'కేవలము' అనే పదము వాడటం వలన ఈ కారణములలో ఏదేని ఒక కారణము వలన మాత్రమే కాకుండా, 15(1) మరియు (2) వ ఆర్టికల్స్ ద్వారా నిషేధించబడని ఏవేని ఇతర కారణములపై కూడ అనుకూల విచక్షణ చూపడం, అది 14వ ఆర్థికలును ఉల్లంఘించినప్పటికి, మాన్యత పొందుతుంది.

15(1) వ ఆర్థికలు, రాజ్యము (State) మతము, జాతి, కులము, లింగబేధము లేదా జన్మస్థలము లేదా వీటిలో ఏదేని ఒక కారణముపై విచక్షణ చూపటాన్ని నిషేధిస్తుంది.

15(2) వ ఆర్థికలు, పౌరులను మరియు ప్రభుత్వాలను దుకాణములు, సార్వత్రిక ఉపహారశాలలో (Public restaurants), 25 ? (Places of public entertainments) ప్రవేశించు విషయమున, బావులు, చెరువులు, రోడ్లు మొదలగు వాటిని వినియోగించుకొను విషయమున విచక్షణ చూపడానికి అనుమతించదు.

ఆర్థికలు 15(3):

ఇది 15(1), (2) వ ఆర్టికల్స్ క్కు మొదటి మినహాయింపు.

ఇది స్త్రీలను, బిడ్డలను రక్షించడానికి ప్రత్యేక నిబంధనలు చేయడానికి ప్రభుత్వానికి అధికారమిస్తున్నది.

?? 15(4): 15(1), (2). ఆర్టికలు, వీలు కల్పించు నిబంధన (enabling provision).

ఈ క్లాజును, రాజ్యాంగ 1 వ సవరణ చట్టం, 1951 ద్వారా 15వ ఆర్థికలుకు జతపరచడం జరిగింది.

ఈ క్లాజు వెనుకబడిన తరగతులకు (Backward Classes) చెందిన వారి హితములను పరిరక్షించుట కొరకు ప్రత్యేక నిబంధనలను చేయడానికి రాజ్యమునకు వీలు కల్పిస్తున్నది.

కనుక ఈ 15(4) వ ఆర్థికలు, ఆర్టికల్ 15 మరియు ఆర్టికల్ 29(2) లకు మినహాయింపు.

## ప్రాథమిక హక్కులు

ఆఫ్ మద్రాసు వూ. చంపకంÈHŽ(AIR 1951 SC 226) 1ను సందర్భంగా ఇచ్చిన తీర్పు పర్యవసానంగా రాజ్యాంగంలో 15(4) వ ఆర్థికలును చేర్చడం జరిగింది.

ఈ కేసులో మద్రాసు ప్రభుత్వం, వెనుకబడిన తరగతులకు చెందిన వారికి సహాయం చేసే ఉద్దేశంలో, ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థుల ప్రవేశము కొరకు అనుమతించుటకు ప్రతి కులమునకు Community) దామాషాను నిర్ణయిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తరువును, అది కమ్యూనల్ స్వభావము కలిగి వున్నదన్న కారణముపై, సుప్రీంకోర్టు శాసనమాన్యము కానిదిగా ప్రకటించింది.

రాష్ట్ర ప్రభుత్వము తరఫున నదరు జి.ఓ, బలహీన వర్గాలకు చెందిన ప్రజల విద్యా విషయిక, ఆర్థిక శ్రేయస్సులను ప్రత్యేక శ్రద్ధతో రాజ్యం మెరుగువరచాలనీ, మరియు వారిని అన్యాయము నుండి రక్షించడానికి కృషి చేయాలని పేర్కొంటూ రాజ్యాంగంలోని 46వ ఆర్టికలును అమలు చేయడానికే ఈ జె. ఓ చేయబడినదని వాదించారు.

అయితే సుప్రీంకోర్టు, 46వ ఆర్టికలులో పొందుపరచబడివున్న రాజ్య విధానపు ఆదేశిక సూత్రాలను అమలుపరచడానికి రాజ్యాంగంలోని 3వ భాగం ద్వారా పౌరులకు హామీ ఈయబడిన ప్రాథమిక హక్కులను త్రోసిరాజీ వడటానికి వీలు లేదని అభిప్రాయవడింది.

కుల ప్రాతివదిక పై పౌరుల మధ్య విచక్షణ చూపటాన్ని నిషేధించే 15వ ఆర్థికలుకు సదరు జి.ఓ. వ్యతిరేకమైనందు వల్ల శాసనమాన్యము కాదని న్యాయస్థానం ప్రకటించింది. అప్పుడు తాత్కాలిక పార్లమెంటు 15వ ఆర్థికలుకు క్లాజు (4)ను చేర్చుట ద్వారా రాజ్యాంగ (మొదటి నవరణ) చట్టము తెచ్చింది. ఈ నవరణ ద్వారా సాంఘికముగాను, ఆర్థికముగాను, విద్యా విషయకంగాను వెనుకబడిన తరగతులకు చెందిన పౌరులకు లేదా షెడ్యూల్డు కులాలు లేదా షెడ్యూలు తెగలకు ప్రత్యేక నిబంధనలు చేయడానికి ప్రభుత్వానికి విచక్షణాధికారం లభించింది.

అయితే, రాజ్యాంగంలో ఎక్కడ గాని, వెనుకబడిన తరగతులు అనే వదం నిర్వచించబడలేదు. ఈ సందర్భంలో ఈ ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి.

(1) సాంఘిక, విద్యా విషయిక వెనుకబాటుతనం అంటే ఏమిటీ ?

(2) రిజర్వేషన్లకు గరిష్ట పరిమితి ఎంత ?

ఈ విషయాలు 15(4) వ ఆర్థికలు క్రింద నిర్ణయించవలసిన ప్రశ్నలు.

(1) వెనుకబడిన తరగతులకు చెందిన వారిని – వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన తరగతులుగా విభజిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. శాననమాన్యం కాదు అని సుప్రీంకోర్టు చెప్పింది.

(2) 15(4)వ ఆర్థికలు క్రింద వెనుకబాటుతనం, సామాజికమైనది విద్యా విషయికమైనది. అయివుండాలని కూడా కోర్టు చెప్పింది.

(3) కులమనేది సంబంధిత అంశమైనప్పటికీ, ఒకానొక తరగతి, వెనుకబడిందా, కాదా అని నిర్ణయించడంలో కులం మాత్రమే ముఖ్యంకాదు. బీదరికం, వృత్తి, నివానముండే చోటును కూడ, పరిశీలనకు తీసుకోవలసిన సంబంధిత

అంశాలే అని కోర్టు వక్కాణించింది.

(4) 15(4)వ ఆర్థికలు, కులాలను గురించి చెప్పడం లేదు. తరగతులు గురించి మాత్రమే చెబుతుంది. కులము మరియు తరగతి ఈ రెండూ ఏకార్థాలు కావు అని సుప్రీంకోర్టు నిర్ధారించింది.

(5) రిజర్వేషన్లు (ప్రత్యేక నిబంధనలు) 50 శాతానికి మించరాదు అని కూడా కోర్టు చెప్పింది.

**భారత రాజ్యాంగము**

పెరియన్ స్టేట్ ఆఫ్ తమిళనాడు (AIR 197) SC 2305) కేసులో సుప్రీంకో అలా నిర్ణయించింది.

(1) కులాల ప్రాతిపదికగా తీసికొని చేయబడిన వెనుకబడిన తరగతుల వర్గీకరణ.

(2) ప్రతి వైద్య కళాశాలను యూనిలుగా పరిగణిస్తూ ప్రభుత్వం తీసుకొన్న చర్మ నలదైనదికాదు. ఆ యూనిటు వర్గీకరణ ప్రాతివదికపై సీట్లు రిజర్వు చేయడం --- అది 14, 1B ఆర్థికు ప్రతికూలంగా వుండటం కారణంగా చెల్లుబడికాదు.

xx. 350r (AIR 1976 SC 2381), తరగతుల పౌరులను నిర్ణయించేందుకు, కులం, పేదరికములు రెండింటిని సంబంధిత అంకాలుగా తీసుకోవాలని నిర్ణయించింది.

స్టేట్ ఆఫ్ యు.పి. 15. ప్రదేశ్ బాండన్ (AIR. 1975 SC 563) 'కములో గ్రామీణ ప్రాంత నేపథ్యం గలిగినవారను ప్రాతిపదికపై ఉత్తరప్రదేశ్లోని కళాశాలల్లో, ప్రవేశం కొరకు సీట్లను రిజర్వూ చేయడం, చెల్లుబడి కాదని, అయితే, కొండ ప్రాంతాలు, ఉత్తరాఖండ్ ప్రాంతాలు, సాంఘీకంగాను, విద్యా విషయకంగాను వెనుకబడి వున్నందువల్ల. అక్కడి నుండి వచ్చే విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించడం సమర్థనీయమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

మునీల్ జల్లే. స్టేట్ ఆఫ్ హర్యానా (1984)4 SCC 296 కేసులో, ముప్రీంకోర్టు, ఒకటి నుండి 8 వ తరగతి వరకు సమిష్టి గ్రామీణ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు, పట్టణ ప్రాంతంలో చదివే విద్యార్థుల కంటే ప్రాధాన్యతను ఎం.బి.బి.ఎస్. బిడి.ఎన్. కోర్సుల్లో ప్రవేశం ఇవ్వడం 15(4) వ ఆర్థికలును ఉల్లంఘిస్తున్నదని, అందువల్ల, అది చెల్లుబడి కాదని తీర్పు చెప్పింది.

స్టేట్ ఆఫ్ యం.సి. ఏూ. నివేదితా CÉÕHŽ(AIR 1981 SC 2045) కేసులో సుప్రీంకోర్టు, రాజ్య వైద్య కళాశాలల్లో విద్యార్థులను ఎంపిక చేయడానికి, వైద్య పూర్వ పరీక్షలో (Pre-Medical examination) కనీస అర్హత మార్కులను షెడ్యూలు కులాలు మరియు షెడ్యూలు తెగల విద్యార్థులకు పూర్తిగా నడలిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కార్య ఉత్తరువు (executive order) శాననమాన్యతను సమర్థించింది.

ప్రిన్సిపాలు, గుంటూరు వైద్య కళాశాల 75. మోహన్రావు (AIR 1976 SC 1904) లో, ప్రతివాది. తల్లితండ్రులు అవలు హిందూ మతానికి అందులోనూ, షెడ్యూల్డు కులమైన మాదిగ కులానికి చెందినవారు. వారు క్రిస్టియన్ మతంలోనికి మారారు. అటు మీదబ వారికి ప్రతివాది జన్మించారు. ప్రతివాది క్రిస్టియన్ మతమును వదలిపెట్టి, తిరిగి హిందూ మతం పుచ్చుకొన్నారు. అటు తర్వాత, తాను షెడ్యూల్డు కులానికి చెందిన వాణ్ణని పేర్కొంటూ, గుంటూరు మెడికల్ కాలేజీలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేశాడు.

ఆయన ప్రవేశం కొరకు తాత్కాలిక ప్రాతిపదికపై ఎంపికయినప్పటికీ, ఆయన జన్మ రీత్యా హిందువు కాదన్న కారణంపై అతని ఎంపికను రద్దు చేయడం జరిగింది.

అ రద్దు ఉత్తరువును ఆయన కోర్టులో నవాలు చేశారు.

సుప్రీంకోర్టు, ఈ కేసులో, 15(4)వ ఆర్థికలు క్రింద షెడ్యూల్డు కులాల వారికి, ప్రత్యేక ఏర్పాట్లు చేయడానికి అధికారం కలిగివుందని, ఈ అధికారం వినియోగించుకొని రాష్ట్ర ప్రభుత్వం, 15 లేదా 29(2) వ ఆర్థికలు ఉల్లంఘించకుండానే షెడ్యూల్డు కులాల సభ్యులకు వైద్య కళాశాలల్లో సీట్లను రిజర్వు చేయవచ్చునని అభిప్రాయపడింది.

మాదిగ కులం షెడ్యూల్డు కులం. ప్రతివాది హిందువుగానే

## ప్రాథమిక హక్కులు

పించి వుండాలని కాననం కోరలేదు కోతించి ఏమం జీవితంలో గణనీయభాగం డాలి ఆయన జన్న రాష్ట్ర షెడ్యూలు కులానికి చెందిన వుండవ కోరు లియా 15 55522 55 22

(AIR 1773 227)

ఈ కేసులో సుప్రీంకోర్టు, ఉన్నత కులానికి చెందిన యువతి, షెడ్యూల్డు తగకు చెందిన క్రిస్ పెండ్లాడినంత మాత్రాన, షెడ్యూలు తెగవారికి లభించే రిజర్వేషను సౌకర్యం లభించదని పేర్కొ దేశ్ IyŽÔáàyŽVS. Žd¼{Ù Ž˜t m+.|¾
(AIR 1990 SC 2004)

అయిదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం 4:1 తీర్పులో వైద్యం, ఇంజనీరింగు వంటి స్పెషాలిటీ కోర్సులకు విద్యార్థులను ఎంపిక చేసుకోవ ప్రతిభ మాత్రమే ముఖ్యాంశమని పేర్కొనింది.
మోహన్ వీర్ సింగ్ లాస్తొ 11. e (AIR 1977 SC 788)
విశ్వవిద్యాలయం వారీగా (University wise) ప్రాధాన్యత, జవాబులాకీతనంతో కూడి 15 వుండేది అయినట్లయితే చట్టబద్ధమని, నివాసం వారీగా (Domicile wise) ధాన్యత, అది పరిమితులను దాటనట్లయితే, అదీ కూడా చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

ఆర్టికల్ 16: పబ్లికు (ప్రభుత్వ) ఉద్యోగం విషయంలో సమానావకాశాలు

(1) ప్రభుత్వం క్రింద ఏదేని వదవిలో ఉద్యోగమునకు లేక నియామకమునకు పౌరులందరికి నమానావరాశాలు వుండవలెను.

(2) కేవలం మత, జాతి, కుల, లింగభేద, అనువంశత, జన్మవల నివాసస్థలం లేదా వాటిలో ఏ ఒక్క కారణాన్ని బట్టి వాటిలో వేటినైనను బట్టి ప్రభుత్వం క్రింది క్రిందఏ ఉ ద్యోగమునకైనను వదవి కైనను ఏ పౌరుడు అనర్హుడు కారాదు. లేక ఆ ఉద్యోగ విషయంలో, వదవి విషయంలో ఏ పౌరునిపై వివక్షత చూపరాదు.
(3) ఈ ఆర్థికలులోని దేదియూ, ఏదేని రాష్ట్ర ప్రభుత్వములో లేకకేంద్ర పాలిత ప్రాంతము ప్రభుత్వమునకు లేక అందలి ఏదేని స్థానిక లేదా ఇతర ప్రాధికారి క్రింద ఒక తరగతి, లేక కొన్ని తరగతుల ఉద్యోగాలలో లేక ఏదేని పదవిలో నియామకము కొరకు బట్టి ఉద్యోగానికి లేని నియామకానికి ముందు ఆ రాష్ట్రంలో లేదా కేంద్రపాలిత ప్రాంతంలో నివాసం అవశ్యకమని విహితపరచు ఏదేని శాసనము చేయుట నుండి పార్లమెంటును నివారించదు.
(4) ఈ అరికలులోని దేదియూ, పౌరులలో వెనుకబడిన తరగతులలో ఏ వర్గములైనను ప్రభుత్వం క్రింద ఏదేని నర్వీనులలో తగినంత ప్రాతినిధ్యం లేదని అభిప్రాయపడినయెడల అట్టి వారి కొరకు నియామకాలను లేదా పోస్టులను ప్రత్యేకించుటకై ఏదేని నిబంధన చేయుట నుండి ప్రభుత్వమును నివారించదు.

[(4-@) ఈ ఆర్థికలులో వున్న వున్నదేదియూ, ప్రభుత్వం క్రింద సర్వీసులలో షెడ్యూలు కులాలు షెడ్యూలు తెగల వారికి తగినంత ప్రాతినిధ్యం లేదని ప్రభుత ప్రభుత్వం భావించిన పక్షంలో, ప్రభుత్వం క్రింద పీదేని నర్వీను తరగతికి పారిణామిక్ సీనియారిటీతో సహా ప్రామోక్ష విషయాలలో లేదా సర్వీసులలోని ఏదేని తరగతి లేదా తరగతుల పోస్టులలో పెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారికి రిజర్వేషను చేయు ప్రత్యేక నిబంధన చేయుల నుండి ప్రభుత్వమును నివారించడి.

# గైర్హాజర్

సాహిత్యం



దిసమొలల్తో తిరుగుతున్న చంటి వేమనల్లారా రండి, నా చిటికెన వేళ్ళు పట్టుకోండి.

ప్రపంచాన్ని ఫుట్బాల్లా తన్నడం నేర్పిస్తాను. పండిన సాయింత్రపు సూర్యుణ్ణి చీకటి కత్తితో కొయ్యడం చూపిస్తాను.

ఉప్పటి సముద్రాలను పుక్కిలించి వూయిస్తాను. ఆకాశపు ఒంటి మీద నడమంతరపు సిల్కు మబ్బుల్ని వలిచి పారేసే కిటుకును బోధిస్తాను.

పసితనం మీద కప్పిన పచ్చిబూతులు పడికట్టు బట్టలు శవం మీద చల్లిన చెల్లని నాణాలు అలంకరణలు

సిగ్గుబిళ్ళల్ని తీసి సినిమా హోర్డింగుల మీద విసిరేసి రండి

నగరం నడిబొడ్డులో తారు రోడ్డు మీద వర్షంలో తడుస్తూ నగ్నంగా నర్తిద్దాం.

పెద్దరికం నోరు నొక్కుకుని పొడి యిళ్ళలోకి దూరుతుంది. క్రమశిక్షణా భారాన్ని మోసుకుపోతున్న కాన్వెంటు క్రీస్తుల్లారా రండి, నాచిటికెన వేళ్ళు పట్టుకోండి. బోడిడాబాలెక్కి బ్లాక్ బోర్డుల్ని గాలిపటాలుగా ఎగరెయ్యడం నేర్పిస్తాను.

భట్టీయం మాస్టారి నాచు ముఖాన్ని పిచ్చిగీతల్లో వేసి చూపిస్తాను.

స్కూలు గోడకు వేళ్ళాడే గంటల గడియారానికి పెడరెక్కలు విరిచి ప్లే గ్రౌండ్లో తన్నిస్తాను.

రిక్షాకోసం చివరి మెట్ల మీద కూర్చున్న చిన్నారుల్లా–చెక్కిళ్ళ మీద చతికిలబడ్డ కన్నీటి చుక్కలకి చక్కిలిగింతలు పెట్టి గలగలా నవ్విస్తాను.

పసిమనసుల్ని తెగ్గోసే క్రోటన్ కత్తెర్లు కిండర్ గార్టెన్లు.

చేతుల్ని చెక్కేసుకునే బ్లేడుల దొంతర్లు పాఠ్య పుస్తకాలు.

రండి, యూనిఫారాలను తీసి పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో పారేసి రండి.

ఎంచక్కా ఇసుకు తిన్నెల మీద కదంతాల్ చేద్దాం. బోధన మళ్ళీ ట్రైనింగ్ స్కూల్లో చేరుతుంది.

తల్లి ఒడిలోంచి జారిపోయిన పిల్ల సిద్దార్థుల్లారా రండి, నా చిటికెన వేళ్ళు పటుకోండి.

యమధర్మరాజుల్లా దున్నపోతుల్నెక్కి దొరల చెరువుల్లోకి స్వారీ చేసుకుంటూ వెళ్ళడం నేర్పిస్తాను. మెత్తటి చేతుల్తో పాలిష్ చేసిన బూట్ల మెరుపులో వర్షాకాలపు ఉదయాలను చూపిస్తాను.

ఫ్యాక్టరీ లాకౌట్ రోజున రహస్యంగా పొగగొట్టంలో చిచ్చుబుడ్లు వెలిగించి దీపావళి ప్రకటిస్తాను. జారిపోతున్న చెడ్డీని పైకి లాక్కొంటూ ముక్కు ఎగరేసే చిట్టి మెకానిక్కులా బులెట్ స్టార్టు చెయ్యడాన్ని అరచేతిలో చూపిస్తాను.

సోమరులను తిట్టే చివరి తిట్లు పసివాళ్ళ చెమట బొట్లు. తుపానుకు చేసే తుది హెచ్చరికలు పసిపాపల నిట్టూర్పులు. రండి, జాకీలు పట్టుకొని బోధి వృక్షసమూహాల క్రిందకు రండి ఎగరలేని వాళ్ళను పైకెక్కిద్దాం. వృద్ధుల్ని సైతం బుద్ధుల్ని చేద్దాం.

## దృష్టి

గెడ్డం గీసుకుంటూ చూసుకునే అద్దం భళ్ళున పగిలిపోతే నాన్న ముఖం పదహారు ముక్కలయింది.

నెత్తుటి చేతుల్తోనే పెంకుల్ని ఎత్తి పారేసిన అమ్మ నీళ్ళకళ్ళను నిలువుటద్దాలు చేసింది.

జర్రున జారిన ఎండు కొబ్బరాకును చూసి నాన్న గుండె పగిలిపోయింది.

నేను యీనెలు లెక్క పెట్టిన ఆకే అమ్మ ఫెళఫెళ విరిచి పొయ్యిలో పెట్టి నాన్న వొంటికి వేణీళ్ళు కాచింది

అన్నం గిన్నె దగ్గర మంచి నీళ్ళు ముళ్ళయి అడ్డం తిరిగితే నాన్న గొంతు వెక్కిళ్ళు కక్కింది. పాపిష్టి నీళ్ళను శపిస్తూ పొరుగింటిలో పరువమ్మి అమ్మ పాయసం తెచ్చింది.

అకారణంగా నీరెండ వేళ కన్నుమూస్తే తగలేసి వచ్చిన నాన్న పొద్దుకుంగకుండానే రెండో పెళ్ళికి లగ్నం పెట్టాడు.

ఆ రాత్రి నాన్న కొడుగ్గా మరణించిన నేను తెల్లారేసరికి

అమ్మ కొడుగ్గా పుట్టాను


## Advertisment Tariff

| | | |
|---|---|---|
| కలర్ ఫుల్ పేజీ (బ్యాక్) | : | రూ.50,000/- |
| కలర్ ఆఫ్ పేజీ (బ్యాక్) | : | రూ.30,000/- |
| కలర్ క్వాటర్ పేజీ (బ్యాక్) | : | రూ. 20,000/- |

## బ్లాక్ & వైట్

| | | |
|---|---|---|
| ఫుల్ పేజీ | : | రూ.30,000/- |
| ఆఫ్ పేజీ | : | రూ. 20,000/- |
| క్వాటర్ పేజీ (బ్యాక్) | : | రూ. 10,000/- |

**Cell : 9381205266**
**8977022449**

## విలేకరులు కావలెను

తెలంగాణ వ్యాప్తంగా మీ ముందుకు వస్తున్న

**జన సమయం**

పక్షపత్రికకు

తెలంగాణలోని అన్ని నియోజక వర్గాల నుండి

**విలేకరులు కావలెను**

ఆసక్తి కలిగినవారు సంప్రదించండి

**సెల్ : 9381205266**
**8977022449**

# వంటింటి మసాలా కాదు... ఆరోగ్య సంజీవని!

ఆరోగ్యం



భారతీయ వంటింట్లో పోపుల పెట్టె తెరవగానే మొదటగా కనిపించేది, ఘుమఘుమలాడే సువాసనను అందించేది జీలకర్ర. మన అమ్మమ్మల కాలం నుండి వంటల్లో రుచి కోసమే కాకుండా, అనేక అనారోగ్య సమస్యలకు ఇంటి వైద్యంగా దీనిని వాడుతున్నారు. ఆయుర్వేదంలో దీనికి 'జీరక' అని పేరు, అంటే జీర్ణప్రక్రియను వేగవంతం చేసేది అని అర్థం.

**1. జీర్ణవ్యవస్థకు మేలైన ఔషధంజీలకర్రలో ఉన్న ఎన్జైమ్‌లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.** గ్యాస్, కడుపు ఉబ్బరం ఉపశమనం: అజీర్తి, పుల్లటి తేనుపులు, కడుపులో మంట వంటి సమస్యలు ఉన్నప్పుడు కొద్దిగా జీలకర్ర నమిలి నీళ్లు తాగితే తక్షణ ఉపశమనం లభిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు: ఇవి ప్రేగు ఆరోగ్యానికీ, అల్సర్లు తగ్గేందుకు సహాయపడతాయి.

**2. బరువు తగ్గడానికి బరువు తగ్గాలనుకునే వారికి జీలకర్ర ఒక అద్భుతమైన ఏజెంట్.** శరీరంలో మెటబాలిజం (జీవక్రియ) వేగాన్ని పెంచి, కొవ్వు త్వరగా కరిగేలా చేస్తుంది. జీరా వాటర్: రాత్రివేళ ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా జీలకర్ర నానబెట్టి, ఉదయాన్నే ఆ నీటిని మరిగించి పరగడుపున తాగడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గి, బరువు అదుపులోకి వస్తుంది.

**3. షుగర్ నివారణ ఊ గుండె ఆరోగ్యంబ్లడ్ షుగర్ లెవల్స్:** జీలకర్రలోని కాంపౌండ్లు ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహించి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. గుండె భద్రత: చెడు కొలెస్ట్రాల్ తగ్గించి, రక్తపోటును సమతౌల్యంలో ఉంచడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**4. రోగనిరోధక శక్తి చర్మ సౌందర్యంరక్తహీనత తగ్గుతుంది:** జీలకర్రలో సమృద్ధిగా ఐరన్ (ఇనుము) ఉంటుంది. దీని వల్ల శరీరంలో రక్తం పెరిగి నీరసం తగ్గుతుంది. చర్మ కాంతి: జీలకర్రలోని విటమిన్–ఇ, యాంటీ బాక్టీరియల్ గుణాలు ముఖంపై మొటిమలు, మచ్చలను నివారిస్తాయి. రోజువారీ వాడకం -- సులువైన చిట్కాలురూపంతయారు చేసే విధానంఉపయోగంజీరా వాటర్1 స్పూన్ జీలకర్రను నీటిలో మరిగించి తాగాలి.బరువు తగ్గడానికి, జీర్ణక్రియకుజీలకర్ర ం తేనెఅరస్పూన్ జీలకర్ర పొడిలో తేనె కలిపి తీసుకోవాలి.గొంతు నొప్పి, రోగనిరోధక శక్తి పెంచడానికిపోపులు / కషాయంరోజూ వంటల్లో ధనియాలు, జీలకర్ర వాడకం.బాడీ డిటాక్సిఫికేషన్

**జాగ్రత్తలు:** జీలకర్ర ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, అధిక మోతాదులో తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అతిగా తగ్గిపోవడం లేదా అలెర్జీలు రావడం జరగవచ్చు. గర్భిణులు వైద్యుల సలహాతో పరిమితంగా వాడటం శ్రేయస్కరం.

# నేల అడుగున దాగున్న 'ఎర్రటి' సంజీవని!



ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన కూరగాయల్లో బీట్‌రూట్ ఒకటి. దట్టమైన ముదురు ఎరుపు రంగులో, ప్రత్యేకమైన తీపి రుచితో ఉండే ఈ దుంప కేవలం వంటకాలకే పరిమితం కాదు. ఆధునిక వైద్య శాస్త్రం నుండి ఆయుర్వేదం వరకు బీట్‌రూట్‌ను ఒక అద్భుతమైన 'సూపర్‌ఫుడ్'గా పరిగణిస్తున్నాయి. రోజువారీ ఆహారంలో దీనిని చేర్చుకోవడం వల్ల లభించే ఆరోగ్య, సౌందర్య ప్రయోజనాలు

**1. రక్తపోటు నియంత్రణ గుండె భద్రతబీట్‌రూట్‌లో నైట్రేట్లు అధిక పరిమాణంలో ఉంటాయి.** ఇవి శరీరంలోకి వెళ్లాక నైట్రిక్ ఆక్సైడ్గా మారుతాయి. ఇది రక్తనాళాలను విశాలపరిచి, రక్త ప్రసరణను సులభతరం చేస్తుంది. బీట్‌రూట్ జ్యూస్ రెగ్యులర్‌గా తాగడం వల్ల అధిక రక్తపోటు సమస్య అదుపులోకి వచ్చి, గుండెపోటు మరియు స్ట్రోక్ ప్రమాదాలు తగ్గుతాయి.

**2. రక్తహీనత కు చెక్శరీరంలో హెమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్నవారికి బీట్‌రూట్ ఒక సంజీవని లాంటిది.** ఇందులో ఐరన్ (ఇనుము), ఫోలేట్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని వేగవంతం చేసి, రక్తహీనతను నివారిస్తాయి. గర్భిణులు, మహిళలకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

**3. స్టామినా, శక్తి రెట్టింపుక్రీడాకారులు,** వ్యాయామం చేసేవారు కసరత్తులకు ముందు బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల శరీరంలో ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. ఇది కండరాల అలసటను తగ్గించి, రోజంతా ఉత్సాహంగా ఉండటానికి సహాయపడుతుంది.

**4. లివర్ డిటాక్సిఫికేషన్ బీట్‌రూట్‌లో ఉండే 'బెటాయిన్' అనే కాంపౌండ్ కాలేయం లో కొవ్వు చేరుకోకుండా చూస్తుంది.** శరీరంలోని హానికర టాక్సిన్లను బయటకు పంపడంలో కాలేయానికి సహాయపడి, లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. **5. జీర్ణక్రియ & బరువు నియంత్రణపీచు పదార్థం :** ఇందులో పీచు ఎక్కువగా ఉండటం వల్ల మలబద్ధకం తగ్గుతుంది, జీర్ణ వ్యవస్థ సాఫీగా సాగుతుంది. తక్కువ క్యాలరీలు: క్యాలరీలు తక్కువగా ఉండి, నీటి శాతం ఎక్కువ ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఆహారం. **6. చర్మ సౌందర్యం సహజ గులాబీ కాంతిబీట్‌రూట్‌లోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి.** లిప్ కేర్: బీట్‌రూట్ రసాన్ని పెదవులపై రాయడం వల్ల పెదవుల నలుపు తగ్గి, సహజమైన పింక్ రంగులోకి మారుతాయి. చర్మంపై ముడతలు, మచ్చలను నివారించి సహజమైన గ్లోను ఇస్తుంది. పచ్చి బీట్‌రూట్ తురుముపై కొద్దిగా నిమ్మరసం, ఉప్పు చల్లుకుని తింటే మంచిది.ూదీజ జ్యూస్: యాపిల్ , బీట్‌రూట్ , క్యారెట్ మూడింటినీ కలిపి తీసుకునే జ్యూస్ రోగనిరోధక శక్తిని విశేషంగా పెంచుతుంది. రైతా / సూప్: బీట్‌రూట్ తురుమును పెరుగులో కలిపి రైతాగా లేదా వేడి వేడి సూప్‌గా తీసుకోవచ్చు. జాగ్రత్త: కిడ్నీలో రాళ్లు సమస్య ఉన్నవారు బీట్‌రూట్‌ను పరిమితంగా తీసుకోవాలి,

# పరుగులతో తలుపు తట్టాడు... టెస్ట్ క్యాప్‌తో తలుపు తెరిచాడు !

## -సర్ఫరాజ్ ఖాన్

క్రీడలు

భారత క్రికెట్‌లో జాతీయ జట్టులోకి రావడం అంత సులభం కాదు. ముఖ్యంగా టెస్ట్ క్రికెట్‌లో చోటు సంపాదించాలంటే ప్రతిభతో పాటు సంవత్సరాలపాటు నిలకడగా పరుగులు చేయాలి. సర్ఫరాజ్ ఖాన్ ప్రయాణం ఇందుకు చక్కటి ఉదాహరణ. ఆలస్యంగా వచ్చిన అవకాశం కోసం అతను ఎదురు చూశాడు... కానీ పరుగులు చేయడంలో మాత్రం ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు. చిన్న వయసులోనే ముంబై స్కూల్ క్రికెట్‌లో తన బ్యాటింగ్ ప్రతిభను చాటుకున్న సర్ఫరాజ్, 2014, 2016 అండర్-19 ప్రపంచకప్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2016 ప్రపంచకప్‌లో భారత బ్యాటర్లలో అత్యధిక పరుగులు సాధించడం ద్వారా తన ప్రతిభను మరోసారి నిరూపించాడు. 2015లో [illegible] అరంగేట్రం చేసిన అతను ı20 క్రికెట్‌లోనూ తన సత్తా చూపించాడు. అయితే అతని అసలు బలం ఎక్కడుందో కాలక్రమంలో స్పష్టమైంది---రెడ్ బాల్ క్రికెట్‌లో! ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సర్ఫరాజ్ గణాంకాలు సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించేంత బలంగా నిలిచాయి. టీమ్ ఇండియాలోకి ఎంపికయ్యే సమయానికి 45 మ్యాచ్‌ల్లో 3,912 పరుగులు, 14 సెంచరీలు, 11 అర్ధసెంచరీలు, 301 నాటౌట్ అత్యధిక స్కోరు అతని ఖాతాలో ఉన్నాయి. ముఖ్యంగా భారీ స్కోర్లుగా ఇన్నింగ్స్‌లను మలచడం అతని ప్రత్యేకత. కేవలం పరుగులు చేయడం కాదు... వాటిని భారీ ఇన్నింగ్స్‌లుగా మార్చడం సర్ఫరాజ్ బ్యాటింగ్‌కు అసలైన గుర్తింపు. అంతర్జాతీయ అవకాశానికి ముందు India A తరఫున ఇంగ్లాండ్ లయన్స్‌పై 160 బంతుల్లో 161 పరుగులు చేయడం అతని ఫామ్‌కు మరో నిదర్శనం. చివరకు 2024 ఫిబ్రవరి 15న రాజ్‌కోట్‌లో ఇంగ్లాండ్‌పై టెస్ట్ అరంగేట్రం చేసే అవకాశం వచ్చింది. ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరపడిన ఆ రోజు సర్ఫరాజ్‌కు మాత్రమే కాదు, అతని కుటుంబానికి కూడా భావోద్వేగ క్షణంగా నిలిచింది. అరంగేట్రంలోనే అతని బ్యాట్ మరోసారి మాట్లాడింది. కేవలం 66 బంతుల్లో 62 పరుగులు చేసి,




అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్‌లోకి తన రాకను ఘనంగా చాటిచెప్పాడు. దూకుడు, ఆత్మవిశ్వాసం, షాట్ ఎంపికలో స్పష్టత---అన్నీ అతని ఇన్నింగ్స్‌లో కనిపించాయి. రన్‌అవుట్ కారణంగా ఇన్నింగ్స్ అనూహ్యంగా ముగిసినా, అతని బ్యాటింగ్ ఇచ్చిన సందేశం మాత్రం స్పష్టంగా వినిపించింది. సర్ఫరాజ్ కథను ఒక గణాంకంతో చెప్పాలంటే---సగటు. ఒక బ్యాటర్ ఎంత తరచుగా పరుగులు చేస్తాడు, ఎంతగా వాటిని భారీ స్కోర్లుగా మలుస్తాడు అన్నది అతని ఫస్ట్‌క్లాస్ రికార్డు స్పష్టంగా చెబుతుంది. అందుకే అతని ఎంపిక వెనుక ఉన్న అసలు కారణం పేరు కాదు... పరుగులే. సర్ఫరాజ్ ఖాన్ ప్రయాణం భారత క్రికెట్‌లో ఒక సందేశాన్ని కూడా ఇస్తుంది: "అవకాశం ఆలస్యం కావచ్చు... కానీ పరుగులు ఆగకూడదు." దేశవాళీ క్రికెట్‌లో గణాంకాలతో తలుపు తట్టిన సర్ఫరాజ్, రాజ్‌కోట్‌లో భారత టెస్ట్ క్యాప్ అందుకున్నాడు. ఇక ఆ క్యాప్‌ను సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌గా మలచడం అతని తదుపరి సవాలు.


**పరుగులే అతని పరిచయం... గణాంకాలే అతని సాక్ష్యం!**

సినిమా

# సందీప్ కిషన్ హీరోగా 'కరికాల' మూవీ టైటిల్ పోస్టర్

'శంబాల' బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు యుగంధర్ ముని సందీప్ కిషన్‌తో ప్రకటించిన ప్రాజెక్ట్ మీద భారీ అంచనాలు ఏర్పడిన సంగతి తెలిసిందే. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రకటన నుంచే ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తించింది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ మూవీకి సంబంధించిన టైటిల్‌ను రివీల్ చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'కరికాల' అంటూ ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రాబోతోంది.

ఈ పోస్టర్‌లో సందీప్ కిషన్ కనిపిస్తున్న తీరు చాలా కొత్తగా ఉంది. గుర్రంపై హీరో, చేతిలో ఖడ్గం, సింహాన్నే పరిగెత్తిస్తున్నట్టుగా ఆ రాజసం అన్నీ కూడా సినిమాపై ఉత్సుకతను పెంచేలా ఉన్నాయి. ఈ టైటిల్ పోస్టర్‌తో ఒక్కసారి అంచనాల్ని రెట్టింపు చేసేశారు. ఈ మూవీని రెండు పార్టులుగా మేకర్లు ప్లాన్ చేశారు. మొదటి చాప్టర్ 2027 జూలై 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, రెండో చాప్టర్ 2027 అక్టోబర్ 28న రానుంది. రెండు పార్టుల రిలీజ్ డేట్‌లను ఒకే సారి ప్రకటించడం చూస్తుంటే.. ఇది ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న స్థాయిని, ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తున్నట్టుగా కనిపిస్తోంది. 'శంభాల' విజయం తర్వాత, దర్శకుడు యుగంధర్ ముని, షైనింగ్ పిక్చర్స్ బృందం ఈ 'కరికాల' ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. విస్తృతమైన ప్రపంచ నిర్మాణం, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్, అత్యద్భుతమైన కథనంతో, 'కరికాల' దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఒక ప్రత్యేకమైన సోషియో-ఫాంటసీ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.




'కరికాల' వంటి అద్భుతమైన టైటిల్ ఆవిష్కరణ, ఆకట్టుకునే ఫస్ట్ లుక్, మ్యాజికల్ ఫాంటసీ సెట్టింగ్, రెండు భాగాలుగా విడుదల చేసే వ్యూహంతో ఒక్కసారిగా రాబోతోన్న పాన్-ఇండియా చిత్రాల్లో ఇదొక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందం పని చేస్తోంది. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు.

నటీనటులు, ఇతర సాంకేతిక సిబ్బంది, సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు తర్వాత వెల్లడించనున్నారు

# సోషల్ మీడియాలో వైరల్ మారిన 'బంగారం' సాంగ్




బిగ్‌బాస్ ఫేమ్ డెమాన్ పవన్, రీతూ చౌదరి జంటగా నటించిన 'బంగారం' ఆల్బమ్ సాంగ్ విడుదలై సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. మెలోడీ, విజువల్స్, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండటంతో ఈ పాట ట్రెండింగ్‌లో కొనసాగుతోంది.

మొదటి నుంచి చివరి వరకు ఫీల్‌గుడ్ రొమాంటిక్ వైబ్‌తో సాగే ఈ పాటలో డెమాన్ పవన్, రీతూ చౌదరి స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ చాలా నేచురల్‌గా ఉండటంతో ఈ పాటను ప్రేక్షకులు మరింతగా ఆస్వాదిస్తున్నారు.

ఈ పాటకు అఫ్రోజ్ అలీ సాహిత్యం అందించడంతో పాటు స్వరపరిచి, స్వయంగా ఆలపించారు. సమీరా భరద్వాజ్ వోకల్స్ పాటకు మరింత అందం తీసుకొచ్చారు. ముఖ్యంగా రఞ్జిత్ రెడ్డి అందించిన మ్యూజిక్ ఈ పాటకు పెద్ద ప్లస్‌గా నిలిచింది. మెలోడీ, బీట్‌లు, అరేంజ్‌మెంట్ అన్నీ కలిసి పాటను మళ్లీ మళ్లీ వినాలనిపించేలా చేశాయి.

మంచి మ్యూజిక్, ఆకట్టుకునే విజువల్స్, ఫ్రెష్ కెమిస్ట్రీతో 'బంగారం' సాంగ్‌కు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఈ పాట సోషల్ మీడియాలో మంచి ట్రెండ్ అవుతూ మ్యూజిక్ లవర్స్ ప్లేలిస్ట్‌లో చోటు సంపాదించుకుంది.

సాంగ్ లాంచ్ ఈవెంట్ లో డెమన్ పవన్ మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. బిగ్‌బాస్ ద్వారా నాకు ఎంతో ప్రేమ, ఆదరణ లభించింది. ఆ ప్రేమతోనే ఈ పాటను నిర్మించాను. ఇదంతా మీ అందరి సపోర్ట్ వల్లే సాధ్యమైంది. ఈ వేడుకకు వచ్చిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మా లిరిసిస్ట్, కంపోజర్ అఫ్రోజ్ అలీకి, సింగర్ సమీరా భరద్వాజ్ గారికి థ్యాంక్యూ. చాలా బ్యూటిఫుల్ సాంగ్ ఇచ్చారు. ఈ పాటను మేమంతా ఒక ఫ్యామిలీ మెంబర్స్‌లా ఎంజాయ్ చేస్తూ షూట్ చేశాం. మీ అందరికీ ఈ పాట నచ్చిందని భావిస్తున్నాను. బ్యానర్‌ను ముందుకు తీసుకెళ్లాలని అనుకుంటున్నాను. అందుకే ఈ సాంగ్‌ను ఇంత గ్రాండ్‌గా లాంచ్ చేశాం. భవిష్యత్తులో డీపీ క్రియేషన్స్‌లో వెబ్ సిరీస్‌లు, సినిమాలు, బిగ్ స్క్రీన్ చిత్రాలు కూడా నిర్మించాలని ప్లాన్ చేస్తున్నాను. దానికి కూడా మీ అందరి ప్రేమ, అభిమానం కావాలి. ఈ సాంగ్‌లో రీతూ నాకు ఎంతో సపోర్ట్‌గా నిలిచింది. మేమిద్దరం మంచి ఫ్రెండ్స్ అయ్యాం. ఈ పాట కోసం అన్నీ చాలా బాగా కలిసి వచ్చాయి. మా ఫ్యామిలీ, రిలేటివ్స్ కూడా ఎంతో సపోర్ట్ చేశారు. నాగార్జున గారు ఈ సాంగ్‌ను లాంచ్ చేసి చాలా బాగుందని చెప్పడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. అలాగే ఉప్పలపాటి శ్యామలాదేవి గారు ప్రోమో లాంచ్ చేసి లాంచ్ చేసి సపోర్ట్ చేశారు. అందరికీ మరోసారి ధన్యవాదాలు.

రీతూ చౌదరి మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. ఈ సాంగ్‌కు ఇంత మంచి రెస్పాన్స్ ఇచ్చిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ పాటలో భాగం కావడం నాకు చాలా ఆనందంగా ఉంది. ముఖ్యంగా డెమన్ పవన్ కోసం ఈ సాంగ్ చేశాను. పవన్ ఎంతో ప్యాషన్‌తో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు.

# మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్, (జనసమయం విలేకరి):

ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి మండల స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఇతర దరఖాస్తులను మండల స్థాయిలో ఎం.పి.డి.ఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి 1 గంటల వరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహిస్తున్నందున, తమ సమస్యలు, వినతులు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల స్థాయిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించాలని తెలిపారు.



# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి

# తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

## డా॥ బండివిజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు






# పారదర్శకంగా రేషన్ పంపిణీ

## రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు






మహబూబ్‌నగర్(జనమయం ప్రతినిధి): ఇకపై రేషన్ పంపిణీ వ్యవస్థ మరింత సులభతరం కానున్నదని, అత్యంత పారదర్శకంగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా రేషన్ పంపిణీ వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, మహబూబ్ నగర్ కలెక్టర్ కుష్వా గుప్తాతో కలసి మంత్రి జూపల్లి కృష్ణారావు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డుల జారీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల స్మార్ట్ కొత్త రేషన్ కార్డులను జారీ చేసినట్లు తెలిపారు.కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం ద్వారా అదనంగా సబ్సిడీయం అందించే చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. జిల్లాలో కొత్తగా మంజూరు చేసిన కార్డులతో కలిపి మొత్తం రేషన్ కార్డుల సంఖ్య **2,79,523** కు చేరిందన్నారు. వీటిలో **9,61,377** మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. రేషన్ దుకాణాలకు ప్రభుత్వం నుండి వచ్చిన సరుకులు, వాటి నిల్వలు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన సరుకుల వివరాలను సైతం పారదర్శకంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డులోని వివరాలను లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో పరిశీలించుకోవచ్చన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడడం, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించడం, అవినీతికి అవకాశం లేకుండా చేయడమే ఈ విధానం లక్ష్యమని తెలిపారు. గత రెండున్నరేళ్లలో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, సబ్సిడియాటిక్ బోనస్, రూ.**500** కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు అందించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలను మాత్రం ఆపడం లేదని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుని పిల్లలు జ్ఞానాన్ని పెంపొందించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, స్వయం సమృద్ధి కోసం మహిళా సంఘాలు, రైతు సంఘాలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ రేషన్ కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు మొబైల్‌లో కనిపిస్తాయని ఎమ్మెల్యే వివరించారు. కుటుంబంలో కొత్త సభ్యులను చేర్చడం, అర్హత మేరకు పేర్లను తొలగించడం వంటి ప్రక్రియలను కూడా సులభతరం చేసినట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులను ఎవరూ ట్యాంపరింగ్ చేయడం లేదా నకిలీ కార్డులు రూపొందించడం వంటి చర్యలకు పాల్పడవద్దని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివానీ, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మల్లా నరసింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మేయర్ డి. మమత, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ ముదావత్ బాల్కోడి, డి.ఎస్.ఓ గంప శ్రీనివాస్, జిల్లా అధికారులు, స్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

Editor, Publisher & Owner, & Place of Publication: V.YADAMMA H.No. C154, Parvathapuram Village, Ghanpur Mandal
Wanaparthy Dist. Telangana - 509380, email : janasamayam@gmail.com, Cell : 9381205266,8977022449
Printed at : Mythri Art Printers, Shop No. 10, Dcc Bank Complex, Mahabubanagar, Telangana-5090001
Office: H.No. 4-42-332, Chennareddy Nagar, Asbestos Colony, Hyderabad (TG) 500037 www.janasamayam.com